ప్రజాశక్తి

ఆదివారం 1 అక్టోబర్ 2023 8 పేజీలు

గుంటూరు

పల్నాడు

ముగిసిన ఖరీఫ్ సీజన్

- పల్నాడు జిల్లాలో 2.52 లక్షల భూమి ఖాళీ
- గుంటూరు జిల్లాలో 90 వేల ఎకరాలలో జరగని సాగు
- చివరి దశలో అధిక వర్షాలు
- ప్రత్యామ్నాయ పంటలపై రైతుల దృష్టి

ప్రజాశక్తి - గుంటూరు జిల్లాప్రతినిధి

గుంటూరు, పల్నాడు జిల్లాల్లో శనివారంతో ఖరీఫ్ సీజన్ ముగిసింది. తొలి మూడునెలల కంటే సెప్టెంబరులో వర్షాలు ఆశాజనకంగా కురిశాయి. కానీ అవసరమైనప్పుడు వర్షాలు కురవకుండా సీజన్ ముగింపు దశలో అధిక వర్షాలు కురవడం వల్ల రైతులు అయోమయంలో చిక్కుకున్నారు. పల్నాడు జిల్లాలో 50 శాతం విస్తీర్ణంలోనే ఖరీఫ్ సాగవగా గుంటూరు జిల్లాలో దాదాపు 80 శాతం విస్తీర్ణంలో పైర్లేశారు. పల్నాడు జిల్లాలో 5.12 లక్షల ఎకరాల్లో పంటలు సాగు చేయాల్సి ఉండగా ఇప్పటి వరకు వరకు 2.60 లక్షల ఎకరాల్లోనే సాగైంది. ఇంకా 2.52 లక్షల ఎకరాల భూమి ఖాళీగా ఉంది. పల్నాడు జిల్లాలో వరి, పత్తి సాగు గణనీయంగా తగ్గింది. పల్నాడు జిల్లాలో 1.25 లక్షల ఎకరాల్లో వరిసాగు చేయాల్సి ఉండగా ఇప్పటివరకు కేవలం 20 వేల ఎకరాల్లోనే వేశారు. 3.05 లక్షల ఎకరాల్లో పత్తి సాగు చేస్తారని అంచనా కాగా లక్షన్నర ఎకరాల్లోనే సాగైంది. 1.30 లక్షల ఎకరాల్లో మిర్చిసాగు చేయాల్సి ఉండగా 60వేల ఎకరాల్లో సాగైంది. 50 వేల ఎకరాల్లో కందిసాగు చేస్తారని అంచనా వేయగా ఇప్పటి వరకు 24 వేల ఎకరాల్లో వేశారు. మరో ఆరు వేల ఎకరాల్లో ఇతర పంటలు సాగు చేశారు. గతేడాది కంటే ఈ ఏడాది విస్తీర్ణం గణనీయంగా తగ్గింది.

సెప్టెంబరులో విస్తారంగా వర్షాలు కురవడం వల్ల రబీ పంటలకు మేలు జరుగుతుందని భావిస్తున్నారు. ప్రధానంగా జొన్న, మొక్కజొన్న, మినుము, పెసర, జ్యూట్, పొద్దుతిరుగుడు, నువ్వులు తదితర పంటలకు ఉపయోగంగా ఉంటుందని చెబుతున్నారు. పల్నాడు జిల్లాలో సెప్టెంబరులో 134.5 మిల్లీమీటర్ల వర్షం కురవాల్సి ఉండగా 197.9 మిల్లీమీటర్లు నమోదైంది. నకరికల్లు, నూజెండ్ల మండలాలు మినహా మిగతా 26 మండలాల్లో సాధారణ వర్షపాతం కంటే ఎక్కువగా నమోదైనట్లు అధికారులు తెలిపారు. మొదటి మూడు నెలలు కనీస వర్షపాతంకు నోచుకోని మాచర్ల,

▶ 2లో

స్వామినాథన్ చిత్రపటానికి పూలమాలవేసి నివాళులర్పిస్తున్న వ్యవసాయ శాఖ మాజీ మంత్రి వడ్డే శోభనాద్రీశ్వరరావు, ఆంధ్రప్రదేశ్ రైతు సంఘం నాయకులు వై.కేశవరావు తదితరులు

పేదల ఆకలిని తీర్చిన ఎంఎస్ స్వామినాథన్

- ఆయన స్ఫూర్తితో వ్యవసాయం, రైతు రక్షణ కోసం పోరాటాలు
- సంస్మరణ సభలో వివిధ సంఘాల నాయకులు

ప్రజాశక్తి - తాడేపల్లి రూరల్

పేదల ఆకలి తీరాలని, రైతులు ఆత్మగౌరవంతో బతకాలని ఆలోచించిన మహోన్నత వ్యక్తి ఎంఎస్ స్వామినాథన్ అని నాయకులు గుర్తు చేసుకున్నారు. హరిత పితామహుడు డాక్టర్ ఎంఎస్ స్వామినాథన్ సమస్మరణ సభ వడ్డేశ్వరంలోని కెబి భవన్ (రైతు సంఘం రాష్ట్ర కార్యాలయం)లో శనివారం నిర్వహించారు. సభకు రైతుసంఘం సీనియర్ నాయకులు వై.కేశవరావు అధ్యక్షత వహించారు. ముఖ్యఅతిథిగా హాజరైన వ్యవసాయ శాఖ మాజీ మంత్రి, సంయుక్త కిసాన్ మోర్చా కన్వీనర్ వడ్డే శోభనాద్రీశ్వరరావు మాట్లాడుతూ నేడు దేశంలో 140 కోట్ల ప్రజలకు ఆహార సమకూర్చడమే కాక, ఇతర దేశాలకు గోధుమలు, వరి, వంటి ఆహార ధాన్యాలను సరఫరా చేసేందుకు ప్రధాన కారణం స్వామినాథన్ పరిశోధనలని చెప్పారు. సీలింగ్ భూములు, బంజర భూములను పేదలకు సాగు చేసుకునేందుకూ ఆయన కారణమన్నారు. రైతు ఆత్మహత్యలను స్వయంగా పరిశీలించి తన అధ్యయనాలను కేంద్ర ప్రభుత్వానికి నివేదించారని, కనీస మద్దతు ధర, ఆర్థికంగా రైతు అభ్యున్నతి కోసం పలు సిఫార్సుల

▶ 2లో

పరీక్షలు చేయించుకున్న వారికి కేస్ షీట్లను అందిస్తున్న మంత్రి రజిని తదితరులు

ప్రతిగడపకూ వైద్యసేవలు

జగనన్న ఆరోగ్య సురక్ష శిబిరం ప్రారంభంలో మంత్రి రజిని

ప్రజాశక్తి-చిలకలూరిపేట

ప్రతి గడపకూ మెరుగైన వైద్యసేవలు అందించేందుకు జగనన్న ఆరోగ్య సురక్ష కార్యక్రమాన్ని రాష్ట్ర ప్రభుత్వం చేపట్టిందని రాష్ట్ర వైద్యారోగ్య శాఖ మంత్రి విడదల రజిని అన్నారు. స్థానిక ఏరియా ఆస్పత్రిలో కార్యక్రమాన్ని శనివారం ప్రారంభించిన మంత్రి మాట్లాడుతూ ఆరోగ్య కేంద్రాల్లో 45 రోజులపాటు అమలు చేసే ఈ కార్యక్రమంలో ఆరోగ్య పరీక్షలతోపాటు అవసరమైన వారికి అందించేందుకు 107 రకాల మందులు సిద్ధం చేశామన్నారు. కీలక కేసులను ఆరోగ్యశ్రీ నెట్‌వర్క్ హాస్పిటళ్లకు సిఫార్సు చేస్తారని చెప్పారు. ప్రజలకు ఇచ్చే

▶ 2లో

10 టీఎంసీల నీటి కోసం కృషి

- 5న హైదరాబాద్‌లో కృష్ణాబోర్డు సమావేశం
- జలవనరుల శాఖ మంత్రి రాంబాబు

ప్రజాశక్తి - సత్తెనపల్లి టౌన్

నీటి విషయమై కృష్ణా బోర్డు సమావేశం ఈనెల 5న హైదరాబాద్‌లో జరుగుతుందని, మన రాష్ట్రానికి ఉన్న హక్కు ప్రకారం 10 టీఎంసీల నీటి కోసం కృషి చేస్తామని రాష్ట్ర జలవనరుల శాఖ మంత్రి అంబటి రాంబాబు చెప్పారు. ఆ నీటిని తాగునీకే ఉపయోగించుకోవాల్సి ఉంటుందని అన్నారు. సత్తెనపల్లి మున్సిపల్ కౌన్సిల్ సమావేశంలో శనివారం మంత్రి మాట్లాడుతూ సాగర్ ఆయకట్టులో రైతులు వరి సాగు చేయొద్దని, నీటి అవసరాలు తక్కువగా ఉండే పంటలే వేసుకోవాలని సూచించారు. ఈ ఏడాది ఆగస్టులో వర్షాభావం మునుపెన్నడూ లేని విధంగా ఉన్న కారణంగా సాగు, తాగు నీటికి ఇబ్బందులు వచ్చాయని

▶ 2లో

మాట్లాడుతున్న మంత్రి అంబటి రాంబాబు

చంద్రబాబు అరెస్టుకు నిరసనగా మోతమోగిద్దాం కార్యక్రమానికి టిడిపి పిలుపునిచ్చిన నేపథ్యంలో గుంటూరు, పల్నాడు జిల్లాల్లో ఆ పార్టీ శ్రేణులు నిరసన తెలిపారు. విజిళ్లు ఊదదంతోపాటు కంచాలు మోగించారు. ఇందులో భాగంగా గుంటూరులో నిర్వహించిన కార్యక్రమంలో నిరసన తెలిపారు.

ఐదేళ్లుగా రైల్వే అభివృద్ధి మందగమనం 8లో

అశ్లీలత నియంత్రణకు పటిష్ట చర్యలు

మహిళలను అవమానిస్తూ చిత్రీకరించే పాటలు, నృత్యాల ప్రదర్శన వద్దు : పల్నాడు కలెక్టర్ 8 లో

ముగిసిన ఖరీఫ్ సీజన్

(మొదటి పేజీ తరువాయి)

దుర్గి, రెంటచింతల, గురజాల, దాచేపల్లి, మాచవరం, అచ్చంపేట, క్రోసూరు, పెదకూరపాడు మండలాల్లో ఈ నెలలో అధిక వర్షపాతం నమోదైంది.

గుంటూరు జిల్లాలో 3.25 లక్షల ఎకరాలకు గాను 2.35లక్షల ఎకరాల్లోనే పంటలు సాగు చేశారు. ఇంకా 1.90 లక్షల ఎకరాల్లో ఏ పంటలూ వేయ లేదు. 1.65 లక్షల ఎకరాల్లో వరి సాగు చేయాల్సి ఉండగా 1.35 లక్షల ఎకరాల్లో వరి వేశారు. 70 శాతం మంది రైతులు వెదపద్ధతిలో సాగు చేయగా 30 శాతం మంది నాట్లు పద్ధతిలో సాగు చేశారు. జిల్లాలో 77 వేల ఎకరాల్లో పత్తిసాగు చేస్తారని అధికారులు ప్రకటించగా 44 వేల ఎకరాల్లోనే సాగైంది. 45 వేల ఎకరాల్లో మిర్చిసాగు చేయాల్సి ఉండగా 24 వేల ఎకరాల్లోనే సాగు చేశారు. 20 వేల ఎకరాల్లో ఇతర పంటలు వేశారు. రబీ పంటలుగా మినుము, పెసర, శనగ, జొన్న, మొక్కజొన్న సాగుకు అవకాశం ఉందని వ్యవసాయశాఖ జిల్లా అధికారి వెంకటేశ్వర్లు తెలిపారు. గుంటూరు జిల్లాలో జూన్, జులై వర్షాలు ఆశాజనకంగా ఉండగా ఆగస్టులో భారీ లోటు ఏర్పడింది. సెప్టెంబరులో 145.2 మిల్లీ మీటర్ల వర్షపాతం నమోదు కావాల్సి ఉండగా 221.9 మిల్లీ మీటర్లు నమోదైంది. తెనాలి, పెదనందిపాడు మినహా మిగతా అన్ని మండలాల్లో అధిక వర్షం కురిసింది.

10 టీఎంసీల నీటి కోసం కృషి

(మొదటి పేజీ తరువాయి)

చెప్పారు. కృష్ణా డెల్టాలో నీరు కొంత ఆశాజనకంగా ఉన్న దృష్ట్యా ఆ ప్రాంతంలో పంటలకు ఇబ్బంది లేదన్నారు. సత్తెనపల్లి పట్టణంలో తాగునీటికి ఇబ్బందుల్లేకుండా చూస్తామని చెప్పారు. ఇదిలా ఉండగా చైర్‌పర్సన్ సిహెచ్ లక్ష్మి తులసి సాంబశివరావు అధ్యక్షతన నిర్వహించిన సమావేశంలో 7 అంశాలతో కూడిన అజెండాను ఆమోదించారు. 6వ వార్డు కౌన్సిలర్ ఎస్.సత్యవాణి మాట్లాడుతూ స్థానిక గ్యాస్ ఏజెన్సీ ద్వారా పట్టణంలో సుమారు 6 వేల కనెక్షన్లు ఉన్నాయని, వినియోగదార్ల నుండి ఏజెన్సీ రూ.40 అదనంగా వసూలు చేయడం ద్వారా సుమారు రూ.6 లక్షలు అదనంగా పొందుతోందని చెప్పారు. దీనికి మంత్రి స్పందిస్తూ పౌర సరఫరాల అధికారుల దృష్టికి సమస్యను తీసుకెళ్లాలని కమిషనర్‌కు సూచించారు.

ప్రతిగడపకూ వైద్యసేవలు

(మొదటి పేజీ తరువాయి)

కేస్ షీట్‌లో సమగ్ర వివరాలు ఉంటాయని, ఎక్కడికెళ్లినా వైద్యం పొందడానికి సులవవుతుందని వివరించారు. రాష్ట్రవ్యాప్తంగా 10574 ఆరోగ్య సురక్ష కేంద్రాలను ఏర్పాటు చేశామని, 14 రకాల పరీక్షలు చేస్తున్నామని తెలిపారు. అనంతరం కుటుంబ సంక్షేమ శాఖ కమిషనర్ జె.నివాస్, రాష్ట్ర ఆరోగ్యశ్రీ ట్రస్ట్ సిఇఒ డాక్టర్ హరేంద్ర ప్రసాద్, పల్నాడు జిల్లా కలెక్టర్ ఎల్.శివశంకర్ మాట్లాడారు. చైల్డ్ హెల్త్ జెసి డాక్టర్ కె.అర్జునరావు, డిసిహెచ్ఎస్ బీవీ రంగారావు, జిల్లా వైద్యారోగ్య శాఖాధికారి డాక్టర్ బి.రవి, మున్సిపల్ చైర్‌పర్సన్ షేక్ రఫాని, ఏరియా హాస్పిటల్ సూపరింటెండెంట్ డాక్టర్ లక్ష్మీ కుమారి పాల్గొన్నారు.

నేడు చేబ్రోలుకు జిల్లా కలెక్టర్

ప్రజాశక్తి - చేబ్రోలు

మండల కేంద్రమైన చేబ్రోలులో ఆదివారం ఉదయం 9 గంటలకు నిర్వహించే స్వచ్ఛతా హి సేవ కార్యక్రమంలో జిల్లా కలెక్టర్ ఎం.వేణుగోపాల్‌రెడ్డి పాల్గొంటారని ఎంపిడిఒ బి.బాబురావు తెలిపారు. ఈ మేరకు శనివారం ఒక ప్రకటన జారీ చేశారు. కార్యక్రమంలో ప్రజాప్రతినిధులు, వివిధ శాఖల అధికారులు, ఉద్యోగులు, స్వచ్ఛంద సేవా సంస్థల ప్రతినిధులు హాజరవ్వాలని కోరారు.

నేడు 40వ వార్షికోత్సవ సభ

ప్రజాశక్తి - మంగళగిరి : స్థానిక శ్రీ మార్కండేయ ఎడ్యుకేషనల్ సొసైటీ 40 వార్షికోత్సవం సందర్భంగా ఆదివారం ఉదయం 10 గంటలకు మంగళగిరిలోని మార్కండేయ కళ్యాణ మండపంలో సభ నిర్వహిస్తామని సొసైటీ కార్యదర్శి పి రాజశేఖర్ శనివారం తెలిపారు. సభకు ఎమ్మెల్సీ మురుగుడు హనుమంతరావు హాజరవుతారని చెప్పారు.

మహనీయుల చరిత్రను అధ్యయనం చేయాలి

- **లయోలా కళాశాల విశ్రాంత వైస్ ప్రిన్సిపల్ సాంబశివరావు**
- **జాషువా జయంతి పోటీల్లో విజేతలకు బహుమతుల ప్రదానం**

ప్రజాశక్తి-తాడేపల్లి

విజేతలకు సర్టిఫికెట్లు అందజేస్తున్న మురళీకృష్ణ

దేశం కోసం సేవ చేసిన మహనీయుల చరిత్రను అధ్యయనం చేయాలని విజయవాడ ఆంధ్ర లయోలా కళాశాల విశ్రాంత వైస్ ప్రిన్సిపల్ గుమ్మా సాంబశివరావు కోరారు. శనివారం గుర్రం జాషువా జయంతి సందర్భంగా తాడేపల్లి పట్టణంలోని జిల్లా పరిషత్ హైస్కూల్, రవీంద్రభారతి హైస్కూల్లో జరిగిన జాషువాపై జరిగిన వ్యాసరచన పోటీల్లో బహుమతి ప్రదానోత్సవ సభ, సర్టిఫికెట్లు అందజేత కార్యక్రమం నిర్వహించారు. ఈ సదర్భంగా జరిగిన సభలకు భీమిరెడ్డి తాతిరెడ్డి, ఎస్కె ఖమ్మర్ హుస్సేన్ అధ్యక్షత వహించారు. ఈ సందర్భంగా సాంబశివరావు మాట్లాడుతూ చదువంటే పాఠ్య పుస్తకాలే కాదని సమాజంలో జరుగుతున్న మార్పులను కూడా గమనించాలని అన్నారు. గుర్రం జాషువా చదివింది 8వ తరగతి అయినా సమాజంలో జరుగుతున్న అనేక రుగ్మతలను తన నవలలు, రచనల ద్వారా ప్రపంచం ముందు ఉంచారని కొనియాడారు. జాషువా చిత్రలేఖనం పట్ల మక్కువ చూపేవారని చెప్పారు. ఓ రోజు ఉపాధ్యాయుని బొమ్మను యధావిధిగా వేయడంతో జాషువాలోని శక్తియుక్తులను గమనించి ఉపాధ్యాయులు ప్రోత్సహించారని చెప్పారు. చిన్నతనంలోనే చుట్టుపక్కల జరుగుతున్న అనేక విషయాల మీద పద్యాలు పాడి పామర్లను సైతం ఆలోచింపజేశారని వివరించారు. ఎక్కడైతే అవమానపడ్డారో వారందరి చేత ప్రశంసలు పొంది చివరకు విశ్వనరుడని నిరూపించుకున్నారని చెప్పారు. బాలోత్సవాల రాష్ట్ర కన్వీనర్ పి.మురళీకృష్ణ మాట్లాడుతూ విద్యార్థుల్లో ఎన్నో నైపుణ్యాలు దాగి ఉంటాయని చెప్పారు. ఎవరూ తక్కువ కాదని వారి ఆసక్తులను బట్టి రాణించాలని కోరారు. నేటికీ సమాజంలో పురుషాధిక్యం కొనసాగుతుందని చెప్పారు. మహిళలు అన్ని రంగాల్లో రాణించడం శుభపరిణామమన్నారు. విశ్రాంత ఎంపిడిఒ, మెజీషియన్ ఎస్.ఆదినారాయణ మాట్లాడుతూ మనుషులందరూ ఒక్కటైనప్పుడు ఎక్కువ తక్కువ ఎందుకని ప్రశ్నించారు. కష్టపడి పని చేసే వారికి తిండి లేని సమాజం మనకెందుకని అన్నారు. వినుకొండలో జన్మించిన జాషువాకు ప్రభుత్వం రెండెకరాల భూమి, ఇల్లు ఇచ్చి గౌరవించిందంటే ఆయన గొప్పతనాన్ని నేటి తరం అర్థం చేసుకోవాలని కోరారు. అనంతరం వ్యాసరచన పోటీల్లో గెలుపొందిన విజేతలకు మెడల్స్‌తో పాటు సర్టిఫికెట్లు అందజేశారు. కార్యక్రమాల్లో మంగళగిరి తాడేపల్లి బాలోత్సవం కోశాధికారి గాదె సుబ్బారెడ్డి, ఆయా పాఠశాలల ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.

ఎంఎస్ స్వామినాథన్‌కు రాజధాని రైతుల నివాళి

ప్రజాశక్తి - తుళ్లూరు

హరిత విప్లవ పితామహుడు,ప్రఖ్యాత వ్యవసాయ శాస్త్రవేత్త, జన్యు శాస్త్ర నిపుణులు ఎంఎస్ స్వామినాథన్ మతికి రాజధాని రైతులు,మహిళలు,రైతు కూలీలు సంతాపం తెలిపారు.శనివారం తుళ్లూరు,ఉద్దండరాయునిపాలెం రైతు దీక్షా శిబిరాలలో స్వామి నాథన్,మతికి సంతాప సూచకంగా రెండు నిమిషాలు మౌనం పాటించారు. వారి కుటుంబ సభ్యులకు సానుభూతి తెలిపారు. వ్యవసాయ రంగం పురోగాభివద్దికి,రైతు సంక్షేమానికి స్వామినాథన్ ఎంతో కషి చేశారని శ్లాఘించారు. ఆహార రంగంలో స్వయం సమద్ధి సాధించేందుకు,ఆకలి,పేదరికం ను పారద్రోలేందుకు ఎన్నో పరిశోధనలు చేశారని అమరావతి రైతు జెఏసి నాయకులు కొనియాడారు. మరో రైతు నాయకులు,ఆంధ్ర ప్రదేశ్ రైతాంగ సమాఖ్య కొల్లేరు పరిరక్షణ కమిటీ అధ్యక్షులు యెర్నేని నాగేంద్రనాథ్ మతి పట్ల రైతులు విచారం వ్యక్తం చేశారు.

భవ్యశ్రీ హంతకులను శిక్షించండి

ప్రజాశక్తి-గుంటూరు జిల్లా ప్రతినిధి

చిత్తూరు జిల్లాలో ఇంటర్ విద్యార్థి భవ్యశ్రీ మృతికి కారణమైన వారిని కఠినంగా శిక్షించాలని గుంటూరు పశ్చిమ నియోజకవర్గం టిడిపి ఇన్చార్జ్ కోవెలమూడి రవీంద్ర డిమాండ్ చేశారు. శనివారం గుంటూరు లాడ్జి సెంటర్లో గుంటూరు పశ్చిమ టిడిపి బిసి సెల్ నాయకులు, వడ్డెర సాధికార సమితి సభ్యులతో కలిసి నిరసన తెలిపారు. రవీంద్ర మాట్లాడుతూ చిత్తూరు జిల్లా పెనమలూరు మండలం పరిధిలో వడ్డెర పొలానికి చెందిన భవ్యశ్రీని అత్యాచారం చేసి బావిలో పడేసిన ఘటనలో తక్షణమే నిందితులను శిక్షించాలన్నారు. దళిత, బిసి యువతులకు ఎక్కడా కూడా భద్రత లేదన్నారు. చెరుకుపల్లి మండలంలో ఒక విద్యార్థిని వైసిపి నేతలు దారుణంగా పెట్రోల్ పోసి చంపేస్తే చర్యలు తీసుకుంటే చిత్తూరు జిల్లా వంటి ఘటనలు జరిగి ఉండేవి కావన్నారు. కార్యక్రమంలో బిసి సంఘాల నాయకులు ఎం.ఈశ్వరరావు, బి.జాన్‌సైదా, సిహెచ్.బాబు, జి.వెంకటేశ్వర్లు, టి.అప్పారావు, శీను, మణి కుమారి, మౌళిక పాల్గొన్నారు.

దాడికి నిరసనగా అర్చకులు ధర్నా

ప్రజాశక్తి-గుంటూరు జిల్లాప్రతినిధి : స్థానిక గోరంట్లలోని శ్రీ వెంకటేశ్వర స్వామి దేవాలయం అర్చకుడుపై దాడి ఘటనకు నిరసనగా జిల్లా వ్యాప్తంగా ఉన్న అర్చకులు శనివారం ఆలయం ఎదుట ధర్నా నిర్వహించారు. వెంకటేశ్వరస్వామి ఆలయంలో అర్చకుడుగా విధులు నిర్వహిస్తున్న నందివెలుగు సాయి చరణ్ అనారోగ్య కారణాలు రీత్యా సెలవు అడగ్గా ఆలయ కమిటీ కార్యదర్శి మేడా సాంబశివరావు, మేనేజర్ చలంచర్ల లక్ష్మీనారాయణ దాడి చేసి కొట్టారని అన్నారు. నాయకులు జె.రామలింగేశ్వర శాస్త్రి, ఎస్.శ్రీధర్‌శర్మ, పి.అనిల్ కుమార్, మేడూరు శ్రీనివాస మూర్తి మాట్లాడుతూ దాతల సొమ్ముతో నిర్మించిన ఆలయంలో దోపిడీ జరుగుతుందన్నారు. ఈ ఆలయాన్ని దేవాదాయశాఖ స్వాధీనం చేసుకోవాలని కోరారు. ఆలయ కార్యదర్శి, మేనేజర్‌పై చర్యలు తీసుకోకుంటే రాష్ట్ర వ్యాప్తంగా ఉద్యమిస్తామని, గుంటూరు అర్బన్ ఎస్పీ కార్యాలయాన్ని ముట్టడిస్తామని హెచ్చరించారు.

పేదల ఆకలిని తీర్చిన ఎంఎస్ స్వామినాథన్

సభలో మాట్లాడుతున్న వడ్డే శోభనాద్రీశ్వరావు, వేదికపై వివిధ సంఘాల నాయకులు

(మొదటి పేజీ తరువాయి)

చేశారని చెప్పారు. వ్యవసాయం మీద ఆధారపడే ఆదివాసీలు, మహిళా రైతులను సైతం ప్రభుత్వాలు ఆదుకోవాలన్నారని అన్నారు. ఆయన సిఫార్సులను ప్రభుత్వాలు అమలు చేసేలా పోరాటాల ద్వారా ఒత్తిడి తేవాల్సిన అవసరం ఉందన్నారు. కౌలురైతు సంఘం రాష్ట్ర ఉపాధ్యక్షులు వి.శ్రీనివాసరావు మాట్లాడుతూ రైతులు, కౌలు రైతులు సమస్యల పరిష్కారానికి స్వామినాథన్ విశేషంగా కృషి చేశారని అన్నారు. ఆహార కొరతతో ఉన్న దేశాన్ని సమృద్ధిగా ఆహార నిల్వలుండి ఇతర దేశాలకు ఎగుమతి చేసే విధంగా కృషి చేసిన మహోన్నత శాస్త్రవేత్త స్వామినాథన్ అని కొనియాడారు. అయితే ప్రభుత్వాల విధానాల వల్ల వ్యవసాయం సంక్షోభంలో ఉందని, హరిత విప్లవం తెచ్చిన కొన్ని రాష్ట్రాల్లోనూ వ్యవసాయ రంగంలో వెనకబడిందని తెలిపారు. విత్తనాలపై బహుళ జాతి కంపెనీలు ఆధిపత్యం చేస్తున్నాయని, రైతు వ్యతిరేక విధానాలను స్వామినాథన్ స్ఫూర్తితో తిప్పికొట్టాలని పిలుపునిచ్చారు. డాక్టర్ స్వామినాథన్ కుటుంబం, అల్లుడు ప్రముఖ శాస్త్రవేత్తగా అభ్యుదయ భావాలతో సేవలు అందిస్తున్నారని తెలిపారు. వ్యవసాయ శాస్త్రవేత్త ప్రొఫెసర్ ఎన్.వేణుగోపాలరావు మాట్లాడుతూ స్వాలంబన అంటే వ్యవసాయం అని నిర్వచనం చెప్పిన ఏకైక వ్యక్తి స్వామినాథన్ అని గుర్తు చేశారు. కొత్త వంగడాల తయారీలో ఆయన కృషి ఎనలేనిదన్నారు.వ్యవసాయ కార్మిక సంఘం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి వి.వెంకటేశ్వర్లు మాట్లాడుతూ కేంద్రంలో బిజెపి అధికారంలోకి వచ్చాక రైతులు ఆత్మహత్యలు పెరిగాయని, వ్యవసాయం సంక్షేభంలో పడిందని అన్నారు. దేశాన్ని, వ్యవసాయాన్ని కార్పొరేట్ శక్తుల నుంచి కాపాడుకోవాల్సిన బాధ్యత అందరిపైనా ఉందన్నారు. తొలుత స్వామినాథన్ చిత్రపటానికి నాయకులు పూలమాలలేసి నివాళులర్పించారు. ఇరిగేషన్ ఇంజినీర్ చెరుకూరి వీరయ్య చౌదరి, రైతాంగ ఉద్యమ నాయకులు ఎర్నేని నాగేంద్రనాథ్, వ్యవసాయ కార్మిక సంఘం రాష్ట్ర అధ్యక్షులు దడాల సుబ్బారావు, ఉపాధ్యక్షులు వి.శివనాగరాణి రైతుకూలీ సంఘం నాయకులు ఝాన్సీ, వివిధ రైతు సంఘాల నాయకులు నరసింహారావు, నరేంద్ర, వై.వెంకటేశ్వరరావు, వెంకటరెడ్డి, కె.రాజశేఖర్‌రెడ్డి, జొన్న శివశంకరరావు, కె.అజయ్ కుమార్, డి.వెంకటరెడ్డి, ఎం.శివసాంబిరెడ్డి, బి.శ్రీనివాసరావు, ఆంజనేయులు, ఎం.శ్రీనివాసరెడ్డి, కె.వెంకటేశ్వరరావు, శివరామకృష్ణయ్య, ఎ.సాంబిరెడ్డి, బి.శివారెడ్డి, పి.కృష్ణ పాల్గొన్నారు.

రోడ్డు ప్రమాదాల్లో ఇద్దరు దుర్మరణం

వరగాని ఉదయ్ బాబు

ప్రజాశక్తి-పెదనందిపాడు రూరల్

మండలంలోని రావిపాడు. జిజిపాలెం గ్రామాల మధ్య శుక్రవారం రాత్రి జరిగిన రోడ్డు ప్రమాదంలో యువకుడు మృతి చెందాడు. పెదనందిపాడు పోలీసులు కథనం ప్రకారం పత్తిపాడు మండలం వంగిపురం గ్రామానికి చెందిన యువకుడు కలకుర్తి అఖిల్, వరగాని ఉదయ్ బాబు ద్విచక్ర వాహనంపై శుక్రవారం రాత్రి పత్తిపాడు నుండి వంగిపురం వెళుతూ పెదనందిపాడు మండలంలోని జి జి పాలెం రావిపాడు గ్రామాల మధ్య రహదారిపై వాహనం అదుపుతప్పి పడిపోయారు ఇరువురికి బలమైన గాయాలు కాగా గుంటూరు ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. చికిత్స పొందుతూ ఉదయ్ బాబు (17)శనివారం ఉదయం మృతి చెందారు ఈ మేరకు మృతిని తల్లి సరిత పెదనందిపాడు పోలీస్ స్టేషన్లో శనివారం ఫిర్యాదు చేశారు. ఈ మేరకు పెదనందిపాడు ఎస్ఐ అబ్దుల్ రెహమాన్ కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

లారీ క్యాబిన్‌లో ఇరుక్కుపోయి మృతి

ప్రజాశక్తి - యడ్లపాడు

జాతీయ రహదారి యడ్లపాడు సమీపంలోని నక్క వాగు వద్ద ముందు వెళ్తున్న విశాఖపట్నం నుండి తమిళనాడు గులకరాళ్ళ లోడు లారీ డ్రైవర్ వెళ్లే క్రమంలో సడన్ బ్రేక్ వేయడంతో వెనుక నుండి గుంటూరు నుండి ఒంగోలు వెళ్తున్న పాల ట్యాంకర్ అదుపుతప్పి వెనక నుండి బలంగా ఢీకొనడం జరిగింది. ఈ క్రమంలో కృష్ణాజిల్లా చల్లపల్లి గ్రామానికి చెందిన ఎం.వెంకటేశ్వరరావు (25) అక్కడికక్కడే క్యాబిన్లో ఇరుక్కొని మృతి చెందాడు.

ప్రమాదానికి కారణమైన తమిళనాడుకు చెందిన లారీ తప్పించుకొని వెళుతున్న సమయంలో గుర్తించిన హైవే సిబ్బంది వెంబడించారు. గణపవరం సెంటర్ వద్ద అదుపులోకి తీసుకొని స్థానిక స్టేషన్‌కు తరలించడం జరిగింది.

ఇద్దరు పిల్లలు సహా తల్లి అదృశ్యం

ప్రజాశక్తి - మంగళగిరి రూరల్

తన ఇద్దరు పిల్లలతో సహా ఓ తల్లి అదశ్యమైన సంఘటన మంగళగిరి- తాడేపల్లి నగరపాలక సంస్థ పరిధి ఆత్మకూరులో చోటు చేసుకుంది. పోలీసులు తెలిపిన వివరాల మేరకు... కార్పొరేషన్ పరిధి ఆత్మకూరు కు చెందిన కట్టా చంద్రశేఖర్ తాపీ పనులకు వెళుతూ కుటుంబాన్ని పోషించుకుంటున్నారు. భార్య ప్రీతి సాగర్ తాడేపల్లిలోని డిమార్ట్ లో పని చేస్తూ భర్తకు చేదోడు వాదోడుగా ఉంటోంది. వీరికి లతా మాధురి (8), శ్రీజయకృష్ణ (6) కుమార్తెలు ఉన్నారు. భార్యాభర్తల మధ్య మన స్పర్ధల నేప థ్యంలో శుక్రవారం రాత్రి భార్య ప్రీతి సాగర్ తన ఇద్దరు కుమార్తెలను వెంటబెట్టుకుని కనిపించకుండా వెళ్లి పోయింది. ఇంటికి వచ్చిన భర్త స్థానికులను, బంధువులను విచా రించినా ఆచూకీ లభించలేదు. దీంతో శనివారం మంగళగిరి రూరల్ పోలీసులకు ఫిర్యాదు చేయగా కేసు నమోదు చేశారు.

విద్యుత్ షాక్‌తో పెయింటర్ మృతి

ప్రజాశక్తి-తాడేపల్లి

తాడేపల్లి బైపాస్‌రోడ్డులో ఓ అపార్టుమెంట్ వద్ద రంగులు వేస్తూ విద్యుత్ షాక్ తగిలి పెయింటర్ మృతిచెందిన సంఘటన చోటు చేసుకుంది. తుళ్లూరు మండలం మల్కాపురం గ్రామానికి చెందిన కూచిపూడి శ్రీకాంత్ (18) మేస్త్రీ పంతా సుధాకర్ ద్వారా నరేంద్రకు సంబంధించిన బిల్డింగ్‌కు రంగులు వేసేందుకు వెళ్లాడు. బిల్డింగ్ పక్కగా హైటెన్షన్ వైర్లు ఉన్నాయి. తగిన జాగ్రత్తలు తీసుకోక పోవడంతో గోడకు పెయింట్ వేసే క్రమంలో విద్యుత్ వైర్లకు చెయ్యి తగిలి అక్కడికక్కడే మృతిచెందాడు. ఒక్కగానొక కొడుకు మృతి చెందడంతో పేద కుటుంబం తల్లడిల్లిపోతుంది. తాడేపల్లి పోలీసులు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నారు.

వృద్ధురాలు అదృశ్యం

ప్రజాశక్తి-గుంటూరు సిటీ

80 సంవత్సరాల వృద్ధురాలు కనపడకుండా పోయిన సంఘటన నగరంలోని లాలాపేట పోలీస్ స్టేషన్ పరిధిలో చోటు చేసుకుంది. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం ఒబులసెట్టీ వనజాక్షి (భర్త సీతా రాములు) సంపత్ నగర్, 2లైన్ నివాసం ఉంటున్నారు. శనివారం 10 గంటల సమయంలో గుడికి వెళ్లి వస్తానని చెప్పి ఇంటి నుంచి బయటకు వెళ్లి సాయంత్రం 7 గం టలు వరకు రాలేదనరు. చుట్టుపక్కల ప్రాంతాలలో వెతి కిన వృద్ధురాలు కనిపించలేదని కొడుకు రవికుమార్ ఇచ్చిన ఫిర్యాదుతో కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు లాలాపేట సీఐ తెలిపారు. సుమారు 5 అడుగుల ఎత్తు, ఎరుపు రంగు ఛాయతో ఉన్న ఆరంజ్ కలర్ చీర కట్టుకొని బయటకు వెళ్లినట్లు తెలిపారు. ఆమె ఆచూకీ తెలిస్తే 98858345 70, 9290843643 8688831311. నంబర్లలో సంప్రదించాలని కోరారు.

వలస కూలీ మృతిపై కేసు

ప్రజాశక్తి- తెనాలి

వలస కూలీ మృతిపై పోలీసులు కేసు నమోదు చేశారు. పట్టణ త్రీ టౌన్ పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం బీహార్ నుంచి పది రోజుల క్రితం వచ్చిన వలస కూలీలు రూరల్ గ్రామం నేలపాడు, పెదరావూరు ప్రాంతాలలో కూలి పనులకు వెళుతున్నారు. వారిలో చున్ చున్ కుమార్ (27) మూడు రోజుల క్రితం అనారోగ్యానికి గురై జిల్లా వైద్రశాల్లో శుక్రవారం చేరాడు. చికిత్స పొందుతూ శనివారం మతిచెందాడు. ఆసుపత్రి నుంచి వచ్చిన సమాచార మేరకు పోలీసులు కేసు నమోదు చేశారు.

నేడు మురళీమోహన్ మ్యూజికల్ వెల్ఫేర్ అసోసియేషన్ వార్షికోత్సవం

ప్రజాశక్తి - పల్నాడు జిల్లా

నేడు ఉదయం 8 గంటల నుండి సాయంత్రం వరకు మురళీమోహన్ మ్యూజికల్ కల్చరల్ వెల్ఫేర్ అసోసియేషన్ ద్వితీయ వార్షికోత్సవం త్యాగరాయ గానసభ ప్రధాన వేదికపై జరుగుతుందని, మురళీమోహన్ మ్యూజికల్ అండ్ కల్చరల్ అసోసియేషన్ ఫౌండర్ ప్రెసిడెంట్ సుగ్గల శేఖర్, కార్యదర్శి మురళీమోహన్, ఉపాధ్యక్షులు జి శ్రీనివాసరెడ్డి లు శనివారం ఒక సంయుక్త ప్రకటనలో తెలిపారు. ప్రముఖ గాయని గాయకులు సంగీత విభావరి నిర్వహిస్తారని, సంగీత అభిమానులు అధిక సంఖ్యలో హాజరై కార్యక్రమాన్ని జయప్రదం చేయాలని కోరారు.

తెనాలిలో ప్రదర్శనలో జిల్లా జడ్జి మాలతి, న్యాయమూర్తులు, న్యాయవాదులు

కోర్టు ప్రాంగణంలో స్వచ్ఛతాహి సేవ

ప్రజాశక్తి - తెనాలి: స్వచ్ఛతా హి సేవ కార్యక్రమాలలో భాగంగా 11వ జిల్లా జడ్జి జి.మాలతి ఆధ్వర్యంలో శనివారం కోర్టు ప్రాంగనంలో పరిశుభ్రత కార్యక్రమాలు చేపట్టారు. మున్సిపల్ శానిటరీ ఇన్‌స్పెక్టర్ ఎ.రామచంద్రరావు పర్యవేక్షణలో మున్సిపల్ సిబ్బంది, న్యాయవాదులు, కోర్టు సిబ్బంది న్యాయస్థాన ప్రాంగణాన్ని శుభ్రపరచారు. అదనపు సీనియర్ సివిల్ జడ్జి ఎం.శ్రీధర్, ప్రిన్సిపల్ జూనియర్ సివిల్ జడ్జి పి.రాజశేఖర్, సెకండ్ అడిషనల్ జూనియర్ సివిల్ జడ్జి జె.సీత, బార్ అసోసియేషన్ అధ్యక్షులు వేణుగోపాలరావు, సెక్రటరీ హరి దాసు గౌరీశంకర్, వైస్‌ప్రెసిడెంట్ చంద్రశేఖర్, గజిని మాణిక్య రావు, మున్సిపల్ స్టాండింగ్ కౌన్సిల్ మల్లికార్జనరెడ్డి, సీనియర్ న్యాయవాదులు, మహిళా న్యాయవాదులు, న్యాయవాద గుమస్తాలు పాల్గొన్నారు.

దేశ స్వచ్ఛత ప్రతిఒక్కరి బాధ్యత కావాలి

ప్రజాశక్తి - గుంటూరు

గాంధీ జయంతి సందర్భంగా స్థానిక టిజెపిఎస్ కాలేజి జాతీయ సేవా పథకం (ఎన్ఎస్ఎస్) యూనిట్ ఆధ్వర్యంలో శనివారం స్వచ్ఛతా హీ సేవ నిర్వహించారు. ప్రిన్సిపాల్ ఎబిపి మనోహర్ మాట్లాడుతూ ప్రతి ఒక్కరూ రోజూ ఒక గంట సేపు స్వచ్ఛత కార్యక్రమంలో పాల్గొని, దేశ అభివృద్ధిలో పాలు పంచుకోవాలని కోరారు. ప్లాస్టిక్ నివారణకు అందరూ కృషి చేయాలని కోరారు. కార్యక్రమంలో గుంటూరు జిల్లా జాతీయ సేవా పథక కార్యక్రమ నిర్వహణ అధికారి డాక్టర్ జెవి సుధీర్ కుమార్, జాతీయ సేవా పథక నిర్వహణ అధికారి ఆర్.జయ శైలజ, అధ్యాపకులు కె.శ్రావణి, డాక్టర్ ఎ.అంజనీ కుమార్, జ్యోతి, నాగమణి, జమద్ బేగం, ఆర్.స్వామి, మేజర్ పి.కుమార్ రాజా, విద్యార్థులు పాల్గొన్నారు.

నేడు ఆంధ్రప్రదేశ్ పద్మశాలి రాష్ట్ర కార్యవర్గ సమావేశం

ప్రజాశక్తి - మంగళగిరి : మంగళగిరి పట్టణంలో ఆదివారం ఉదయం 11 గంటలకు ఆంధ్రప్రదేశ్ పద్మశాలి రాష్ట్ర కార్యవర్గ సమావేశం గంజి వెంకయ్య, సామ్రాజ్యం కళ్యాణ మండపంలో జరుగుతుందని సంఘం రాష్ట్ర వర్కింగ్ ప్రెసిడెంట్ ఎం.వెంకటేశ్వరరావు తెలిపారు. సమావేశంలో 26 జిల్లాల పద్మశాలి సంఘం అధ్యక్షులు పాల్గొంటారన్నారు.

వైసిపి పొన్నూరు పట్టణ అధ్యక్షునిగా మహమ్మద్

ప్రజాశక్తి - పొన్నూరు రూరల్ : వైసిపి పొన్నూరు పట్టణ అధ్యక్షునిగా షేక్ కార్పొరేషన్ మాజీ చైర్మన్ షేక్ యాసీన్ మేనల్లుడు, ఎంఎం యూత్ సభ్యుడు ఎంఎ మొహమ్మద్ నియమితులయ్యారు. తన నియామకానికి కృషి చేసిన ఎమ్మెల్యే కిలారి వెంకట రోశయ్యకు మహమ్మద్ ప్రత్యేకంగా కృతజ్ఞతలు తెలిపారు. రానున్న ఎన్నికల్లో పార్టీ మళ్లీ గెలిచేలా, జగన్‌మోహన్‌రెడ్డి మరోసారి ముఖ్యమంత్రి అయ్యేలా వైసిపి బలోపేతానికి కృషి చేస్తానని చెప్పారు. ఈ సందర్భంగా ఆయనకు పలువురు శుభాకాంక్షలు తెలిపారు.

త్రికోటేశ్వరుని హుండీ ఆదాయం రూ 51.44 లక్షలు

ప్రజాశక్తి - పల్నాడు జిల్లా : కోటప్పకొండ త్రికోటేశ్వరస్వామి వారి దేవస్థానంలో శనివారం నూతన పాలకవర్గం సమక్షంలో హుండీ లెక్కింపు దేవస్థానం కార్యనిర్వహణాధికారి జి.శ్రీనివాసరెడ్డి ఆధ్వర్యంలో, చేజర్ల గ్రూపు దేవస్థానముల కార్యనిర్వహణాధికారి, వై.వెంకయ్య పర్యవేక్షణలో హుండీ లెక్కించారు. శనివారం వరకు హుండీల ద్వారా రూ.47,33,348, అన్నదానం హుండీ ద్వారా రూ.4,10,521, మొత్తంగా మూణ్ణెలలో రూ.51,43,869 ఆదాయం వచ్చినట్లు కార్యనిర్వహణాధికారి తెలిపారు.

ప్రకటన

నా క్లయింటు అయిన కుంచనపల్లి వెంకటేశ్వర్లు తండ్రి : పున్నయ్య, నివాసం : ఉన్నవ గ్రామం అను వారి నుండి సమాచారం పొంది యావన్మందికి తెలియజేయునది ఏమనగా,

నా క్లయింటుకు సంబంధించి చిలకలూరిపేట రిజిస్టర్ ఆఫీసులో రిజిస్టర్ కాబడిన ఒరిజినల్ డాక్యుమెంట్ నెం. 1902/1984 తేది : 18-5-1984 ది : 29-9-2023వ తేదీన ఉదయం 10 గం.ల సమయంలో నా క్లయింటు పని నిమిత్తం యడ్లపాడు ఎంఆర్ఓ ఆఫీసు దగ్గరకు రాగా అతని బ్యాగ్‌లోవున్న డాక్యుమెంట్లు ఎంఆర్ఓ ఆఫీసు పరిసర ప్రాంతంలో జారిపడిపోయినవి. అవి వెతికి చూసుకోగా ఒరిజినల్ డాక్యుమెంట్ కనిపించి యుండలేదు. ఎవరికైనా దొరికినచో ఈ క్రింది అడ్రస్‌కు తెలియజేయగలరు. లేక తెచ్చి ఇవ్వగలరు. ఆ యొక్క డాక్యుమెంట్లలోని వంకాయలపాడు గ్రామ సర్వే నెంబరు : 123/ఎ విస్తీర్ణము య : 0-55 సెంట్లకు సంబంధించి ఎవరైనా ఉత్తర ప్రత్యుత్తరాలు జరిపినచో అవి చెల్లనేరవని కూడా తెలియజేయడమైనది.

ఇట్లు
పోతుల వెంకటేశ్వరరావు (వెంకట్)
పోతుల దృశ్య,
డి.శివప్రసాద్ నాయక్,
అడ్వకేట్స్,
ఎంఆర్ఓ ఆఫీస్ ఎదురు, చిలకలూరిపేట.
సెల్ : 9440207917, 9948421017, 8019968595

IN THE COURT OF THE PRINCIPAL JUNIOR CIVIL JUDGE AT TENALI.
E.P. No. 122/2019 Dispute No. 43/2014

Between :
Shriram Chits Pvt. Ltd. Tenali,
Rep. by its Legal Manager / GPA Holder
.... Petitioner / DHR
Vs
Nannapaneni Rama Prasad and others
.... Respondents / JDR's

JDR-1 :
Nannapaneni Rama Prasad, S/o Sambasiva Rao, Hindu, aged 47 years, Business, and R/o D.No. 14-42-4/A, Marrispet, Tenali, Present Address : R/o D.No. 14-40-57, Dwaraka Nagar, Near Narayanadhri Towers, Marrispet, Tenali, Guntur District..

పై నెంబరు ఇ.పి.లో 122/2019 in Dispute No. 43/2014 లో JDR No.1 మీకు కోర్టు ద్వారాను రిజిష్టరు పోస్టు ద్వారాను అనేక పర్యాయములు సమన్లు చేయించిననూ మీరు తీసుకొనక కాలయాపన చేయుచున్నందున ఈ పేపరు ప్రకటన ద్వారా నోటీసు చేయవలసినదిగా కోర్టువారు ఆర్డరు వేస్తూ ది. 16-10-2023 వాయిదా వేసియున్నారు. సదరు వాయిదారోజు ఉదయం 10-30 గం.లకు మీరు స్వయంగా గానీ, మీ తరపు లాయరుగారి ద్వారా గాని కోర్టువారి ఎదుట హాజరై మీ ఆక్షేపణలు తెలుపుకొనవలెను. లేనియెడల సదరు దావా మరియు పైన తెలిపిన పిటీషన్‌లో మీ పరోక్షమున విచారించి తీర్మానించబడును.

(శ్రీ కోర్టువారి ఉత్తర్వులతో)
Order Date : 14-9-2023
Hearing Date : 16-10-2023

వెల్లంకి విశ్వేశ్వర శాస్త్రి,
వాది తరపున న్యాయవాది,
తెనాలి. సెల్ : 7799300284

అప్పీలు నోటీసు

మహారాజశ్రీ ప్రిన్సిపల్ డిస్ట్రిక్ట్ జడ్జ్ వారి కోర్టులో, గుంటూరు
A.T.A. No. 5/2018

Between:
నారిసెట్టి శ్రీనివాసరావు, S/o.లేటు కోటేశ్వరరావు, R/o. సుద్దపల్లి గ్రామము, చేబ్రోలు మండలం, గుంటూరు జిల్లా.
...పిటిషనరు/ అప్పీలెంట్

మరియు

1)బొల్లినేని మంగమ్మ, 2)నాగమోతు వేంకటేశ్వరరావు, 3) నాగమోతు తిరుపతయ్య (డైడ్),4) కొల్లా రాంబాబు,5)కంకణాల రంగమ్మ,(4 & 5 రెస్పాండెంట్స్ IA. No.1652/2011 లోని కోర్టువారి ది.03-02-2015 తేదీ గల ఉత్తర్వుల ప్రకారం చేర్చబడినాడు).
...రెస్పాండెంట్స్

To:
బొల్లినేని మంగమ్మ, W/o. లేట్ సుబ్బారావు ఇంతకు ముందు అన్నపర్తి గ్రామము, పెదనందిపాడు మండలం, గుంటూరు జిల్లా, ప్రస్తుతం వృద్ధాశ్రమాలు, గుంటూరు.

పై నెంబరు అప్పీలెంట్ గుంటూరు ప్రిన్సిపల్ జూనియర్ సివిల్ జడ్జి కోర్టు వారు ATC No.7/2010లో ది.28-02-2018వ తేదీన ఇవ్వబడిన ఆర్డర్స్‌పై పైనెంబరు అప్పీల్ చేసుకొనిన దరిమిలా, సదరు అప్పీల్‌లో మీకు పలు మార్లు నోటీసులు జారీ చేసియున్ననూ, మీకు ముట్టియుండనందున, పేపర్ ప్రకటన ద్వారా మీకు అప్పీల్ నోటీసులు జారీ చేయగలందులకు కోర్టు వారు ఉత్తర్వులు ఇచ్చి సదరు పై నెంబరు అప్పీల్ ను ది.12-10-2023 తేదీకి వాయిదావేసినారు. కనుక మీరు గాని మీ సంజాయిషీ పొందిన మీ తరుపు వకీలు గాని పై వాయిదా తేదీకి అనగా ది. **12-10-2023** తేదీ **ఉ॥గం॥10-30ని॥**లకు హాజరై సదరు మీఅభ్యంతరములు ఉన్నయెడల తెలియపరుచుకోవలెను. లేని యెడల సదరు పై నెంబరు అప్పీల్ మీ పరోక్షమందు విచారించి, తీర్మానింపబడునని, ఇందు మూలముగా కోర్టు వారు ఉత్తర్వులమేరకు తెలియచేయడమైనది.

ఆర్డర్ తేదీ: 15-09-2023, వాయిదా తేదీ: 12-10-2023.

S/d. **దొడ్డి వెంకటేశ్వర రావు,**
పిటిషనరు/అప్పీలెంట్ తరుపు న్యాయవాది

విద్యార్థులను అభినందిస్తున్న రాయల శ్రీనివాసరావు, ఓగూరి శ్రీనివాసరావు

రాష్ట్ర స్థాయి అథ్లెటిక్స్ పోటీల్లో వాగ్దేవి జూనియర్ కళాశాల విద్యార్థుల ప్రతిభ

ప్రజాశక్తి - పల్నాడు జిల్లా

ఆచార్య నాగార్జున యూనివర్సిటీలో గత నెల 20 నుండి 23వ తేదీ వరకు జరిగిన అథ్లెటిక్స్ రాష్ట్రస్థాయి పోటీల్లో వాగ్దేవి జూనియర్ కళాశాల విద్యార్థులు ప్రతిభ చాటి గెలుపొందారని కళాశాల ప్రిన్సిపల్ ఓగూరి నాగేశ్వరరావు శనివారం ప్రకటనలో తెలిపారు. అండర్ - 18 విభాగంలో జజ్జూరి యశ్వంత్ 2000 మీటర్ల మీ ట్రిపుల్ చేజ్ లో 3 స్థానం సాధించగా , అండర్ - 20 విభాగంలో షేక్ షాజహాన్ బి 4X100 మీటర్ల రీలేలో రెండవ స్థానం సాధించారని ప్రకటనలో పేర్కొన్నారు. ఈ సందర్భంగా కళాశాలలో అభినందన సభ ఏర్పాటు చేసి విద్యార్థులను అభినందించారు. కళాశాల సెక్రటరీ, కరస్పాండెంట్ రాయల శ్రీనివాస రావు మాట్లాడుతూ క్రీడలు మానసిక ఉల్లాసానికి శరీర దఢత్వానికి దోహదం చేస్తాయన్నారు. తమ కళాశాల విద్యార్థులకు విద్యతో పాటు ఆట పాటలు ముఖ్యంగా క్రమశిక్షణకు ప్రాధాన్యత ఇస్తున్నామన్నారు. ప్రతిభ చాటిన విద్యార్థులను కళాశాల డైరెక్టర్ లు కట్ల రామ కోటేశ్వరరావు, కపిలవాయి రాజేంద్ర ప్రసాద్, పాశం కష్టారావు, పివి అమృతరావు, ఫిజికల్ డైరెక్టర్ రాయల ఆంజనేయులు అభినందించారు.

రాష్ట్రస్థాయి క్రీడా పోటీలకు గురుకుల విద్యార్థినులు

ప్రజాశక్తి-విజయపురిసౌత్

ఈ నెల 26న బాపట్లలో జరిగిన ఉమ్మడి జిల్లా అండర్-19 రోప్ స్కిప్పింగ్, చెస్ పోటీలలో విజయపురిసౌత్‌లోని డాక్టర్ బిఆర్అంబేద్కర్ గురుకుల కళాశాల విద్యార్థినులు జ్యోత్స్న, భ్యూలా తమ ప్రతిభను చాటి రాష్ట్ర స్థాయి పోటీలకు ఎంపికైనట్లు ప్రిన్సిపాల్ మేరి మంజుల శనివారం తెలిపారు. అండర్-14,17 విభాగాలలో ఈ నెల 27న జరిగిన సాఫ్టుబాల్ పోటీలలో అలేఖ్య, నందిని, ఆర్ అంజలి గెలుపొంది రాష్ట్ర స్థాయి పోటీలకు ఎంపికయ్యారన్నారు. అలాగే , పొన్నూరు మండలం దొప్పలపూడి జెడ్పీ హైస్కూల్లో జరిగిన ఉమ్మడి జిల్లా స్థాయి అండర్-19 సాఫ్ట్ బాల్ పోటీలలో అంజలి, స్నేహలు రాష్ట్ర స్థాయి పోటీలకు ఎంపికవ్వగా, స్టాండ్ బైగా ప్రియాంక ఎంపికైందని తెలిపారు. అండర్-19 బేస్‌బాల్ పోటీలలో ప్రత్యూష, నవ్య, స్టాండ్ బైగా రజని ఎంపికైనట్లు తెలిపారు. ప్రిన్సిపాల్, వైస్‌ప్రిన్సిపాల్ రాజ్యలక్ష్మి, పిడి మహబూబి, పీఈటీ నసీమలు వారిని అభినందించారు.

జిల్లాస్థాయి ఆటల పోటీలకు 12 మంది బాలికలు

ప్రజాశక్తి-అమరావతి

డాక్టర్ బి.ఆర్ అంబేద్కర్ గురుకుల పాఠశాలలో నియోజకవర్గ స్థాయి అండర్ 14,17, 19 కేటగిరిలలో ఎంపికైన 12 మంది బాలికలను జిల్లాస్థాయి క్రీడలకు వెళ్లారని ప్రిన్సిపల్ రాణి ఇందిరా ప్రియదర్శిని శనివారం తెలిపారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ క్రీడల ద్వారా విద్యార్థులు మానసిక ఉల్లాసని పొందుతారని, చదువులో కూడా రానిస్తారని ఆమె అన్నారు.

3న బ్లాక్ డేను జయప్రదం చేయండి

సన్నాహక సమావేశంలో ప్రజా సంఘాల ఐక్య కార్యాచరణ కమిటీ పిలుపు

ప్రజాశక్తి - పల్నాడు జిల్లా

అక్టోబర్ 3న జరిగే బ్లాక్ డే కార్యక్రమాన్ని అన్ని మండల కేంద్రాల్లో జయప్రదం చేయాలని ప్రజా సంఘాల ఐక్య కార్యాచరణ కమిటీ పిలుపు నిచ్చింది. మండల కేంద్రం నకరికల్లులోని ప్రజాసంఘాల కార్యాలయంలో శనివారం రైతు,కార్మిక, కౌలు రైతు, వ్యవసాయ కార్మిక సంఘాల సంయుక్త సమావేశం జరిగింది.

ఈ సమా వేశానికి రైతు సంఘం జిల్లా కార్యదర్శి ఏపూరి గోపాలరావు అధ్య క్షత వహించారు. కేంద్ర ప్రభుత్వం తీసుకొచ్చిన మూడు వ్యవసాయ నల్ల చట్టాలకు వ్యతిరేకంగా పోరాటం జరిగే సందర్భంలో, ఉత్తర్రప్రదేశ్ లోని లఖింపూర్ ఖేరి లో నిరసన తెలియ జేస్తున్న రైతులపై, జీపును నడిపించి హత్య చేసిన ఘటన అక్టోబర్ 3 న బ్లాక్ డే జరిపి నిరసన తెలియ జేయాల్సిందిగా పిలుపు నిచ్చారన్నారు. ఈ ఏడాది ఆగస్టు 24వ తేదీన జరిగిన జాతీయ సదస్సులో పాల్గొన్న సం యుక్త కిసాన్

మోర్చా, 11 కేంద్ర కార్మిక సంఘాలు, స్వతంత్ర ఫెడరేషన్ల ఐక్యవేదిక పిలుపు మేరకు ఈ కార్యక్రమాన్ని జయప్రదం చేయాలని పిలుపు నిచ్చారు. రైతు హంతకులను వెనకేసుకొస్తున్న కేంద్ర ప్రభుత్వ ఆగడాలను ఎండగడుతూ, రైతు, కార్మిక వ్యతిరేక విధా నాలను నిరసిస్తూ జరిగే నిరసన కార్యక్రమాల్లో అన్ని మండల కేంద్రాల్లో రైతులు, కార్మికులు, వ్యవసాయ కార్మికులు పెద్ద ఎత్తున పాల్గొని జయప్రదం చేయాలని కోరారు. కార్యక్రమంలో రైతు సంఘం జిల్లా అధ్యక్షుడు గుంటుపల్లి బాలకృష్ణ, కౌలు రైతు సంఘం జిల్లా అధ్యక్ష కార్యదర్శులు వై.రాధాకృష్ణ, కామినేని రామారావు, సిఐ టియు జిల్లా కార్యదర్శి ఆంజ నేయ నాయక్, కోశాధికారి శివకుమారి, వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా కార్యదర్శి అనుముల లక్ష్మీశ్వర్‌రెడ్డి తది తరులు పాల్గొన్నారు.

రైల్వే అండర్ గ్రౌండ్ బ్రిడ్జి నిర్మించొద్దని వినతి

ప్రజాశక్తి-సత్తెనపల్లి రూరల్

రైల్వే అండర్ గ్రౌండ్ బ్రిడ్జి (ఆర్‌యుబి) నిర్మించవద్దని అధి కారులను గ్రామస్తులు అడ్డుకున్నారు. సత్తెనపల్లి మండలం కంకణాల పల్లి పంచాయతీ పరిధిలోని రైల్వే గేటు ఎల్ సీ నెం 41 స్థానంలో ఆర్‌యూబీని నిర్మించేందుకు రైల్వే అధికారులు నిర్ణయించారు. ఈ నేపథ్యంలో గ్రామస్తుల అభిప్రాయాలు సలహాలు తీసుకునేందుకు సత్తెనపల్లి ఆర్డీఓ బిఎల్ఎన్ రాజకుమారి తహశీల్దార్, ఎస్ సురేష్, రైల్వే ఎడిఆర్ఎం టి వి కృష్ణయ్య లు శనివారం రైల్వే గేటు వద్ద వెళ్లారు. అయితే, 'ఆర్‌యూబీ మాకొద్దు' అని గ్రామస్తులు స్పష్టం చేశారు. రైతులకు, గ్రామ స్థులకు ఇబ్బందులు కలగకుండా ఆర్‌యూబీని నిర్మిస్తామని గ్రామస్తులకు రెవెన్యూ అధికారులు హామీ ఇచ్చారు. వర్షా కాలంలో అండర్ గ్రౌండ్ బ్రిడ్జి లోకి వర్షపు నీరు వస్తోందని , దీనివలన వ్యవసాయ కూలీలు పనులకు వచ్చే పరిస్థితి

ఆర్డీఓ కు వినతి పత్రం అందజేస్తున్న చిత్రం

లేదని అధికారులకు వివరించారు. సిపిఎం మండల కార్యదర్శి పెండ్యాల మహేష్ మాట్లాడుతూ రైతుల అభిప్రాయాలకు భిన్నంగా ఆర్‌యూబీ నిర్మాణం చేపడితే పనులను అడ్డు కుంటామని హెచ్చరించారు. ఆర్డీఓకు గ్రామస్తులు వినతి పత్రం అందజేశారు. కార్యక్రమంలో సర్పంచ్ చెరుకూరి వన్నూరు, రైతులు ఎం.శ్రీనివాసరావు, జి.సుబ్బారావు, పి.వెంకటేశ్వరరావు పాల్గొన్నారు.

20వ వార్డులో సైడ్ కాల్వలు శుభ్రం చేయించండి

ప్రజాశక్తి-సత్తెనపల్లి

పట్టణంలోని 20వ వార్డులో మురుగునీరు ఇళ్ల ముందుకు చేరుతున్న కారణంగా దుర్వాసన భరించలేపోతున్నామని, సైడ్ కాల్వలను శుభ్రం చేయించాలని స్థానికులు వాపోయారు. 20వ వార్డు ప్రజలు సిపిఎం ఆధ్వర్యంలో మున్సిపల్ కమిషనర్ కె.షమ్మీ కు వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా సిపిఎం పట్టణ కార్యదర్శి ధరణికోట విమల మాట్లాడుతూ ఆ వార్డులో రుషి గుడి బజారులో విట్టా నాగేశ్వరరావు ఇంటి వద్ద నుండి చిన్నం శ్రీనివాసరావు ఇంటి వరకు సైడ్ కాల్వలు శుభ్రం చేయకపోవడంతో మురుగు నీటితో నిండిపోయాయని, దుర్వాసన భరించలేకపోతున్నామని అన్నారు. ఈ విషయాన్ని గతంలో అనేకసార్లు మున్సిపల్ అధికారులు దృష్టికి తీసుకెళ్లినా ఫలితం లేదని అన్నారు. ఇప్పటికైనా మున్సిపల్ అధికారులు స్పందించి మురుగు కాలువలు శుభ్రం చేయించాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో స్థానిక మహిళలు ఎం శివ, కె ఈశ్వరమ్మ,సి హెచ్ అరుణ సిహెచ్ వాసవి టి వెంకయ్యమ్మ ,చిన్నం వెంకట నరసమ్మ,ఎం శివ పార్వతి,పి కోటేశ్వరమ్మ తదితరులు పాల్గొన్నారు.

మున్సిపల్ కమిషనర్ కె.షమ్మీ కు వినతిపత్రం అందజేస్తున్న 20వ వార్డు ప్రజలు

రైతు సంక్షేమానికి స్వామినాథన్ కృషి మరువలేం

ప్రజాశక్తి - ముప్పాళ్ల

హరిత విప్లవ పితామహుడు,వ్యవసాయ శాస్త్రవేత్త ఎంఎస్ స్వామినాథన్ మతి దేశ రైతాంగానికి తీరనిలోటని రైతు సంఘం జిల్లా కార్యదర్శి గోపాల్ అన్నారు.మండల కేంద్రంలో శనివారం ఎంఎస్ స్వామినాథన్ సంస్మరణ సభ నిర్వహించారు. స్వామినాథన్ చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. అనంతరం గోపాల్ మాట్లాడుతూ వ్యవ సాయ రంగంలో రైతు సంక్షేమానికి స్వామినాథన్ ఎంతో కృషి చేశారని అన్నారు. వ్యవసాయ రంగంలో ఎన్నో విప్లవాత్మక మార్పులు తీసుకువచ్చిన ఘనత ఆయనదన్నారు. మాదలలో జరిగిన జరిగిన స్వామినాథన్ సంస్మరణ సభలో రైతు సంఘం జిల్లా అధ్యక్షుడు

గుంటుపల్లి బాలకృష్ణ పాల్గొన్ని మాట్లాడారు.ఈ కార్యక్రమంలో రైతు సంఘ నాయకులు గాలా జాలయ్య, కందిమళ్ల సాంబశివరావు,తొరటి అమరలింగేశ్వరరావు, నరసింహారావు,మార్పుల వెంకటరెడ్డి, పఠాన్ సైదాఖాన్, కంచర్ల నాగేశ్వరరావు తదితరులు పాల్గొన్నారు

జెఎన్‌టియు-కె యూనివర్సిటీ నిర్మాణ పనుల పరిశీలన

ప్రజాశక్తి - పల్నాడు జిల్లా

నరసరావుపేట మండలంలోని కాకాని గ్రామంలో నిర్మాణంలో ఉన్న జేఎన్టీయూ-కె యూనివర్సిటీని ఎమ్మెల్యే డాక్టర్ గోపిరెడ్డి శ్రీనివాస్‌రెడ్డి,ఎపి ఎస్‌సిహెచ్‌ఈ చైర్మన్ హేమచంద్రారెడ్డి, జేఎన్టీయూ-కె యూనివర్సిటీ వైస్ ఛాన్సలర్ జి.వి.ఆర్ ప్రసాద్ రాజు లు శనివారం సందర్శించారు. అనంతరం నిర్మాణంలో ఉన్న యూని వర్సిటీని సంబంధించిన తరగతి గదులను, ఇంజనీరింగ్ విభాగములు, ల్యాబ్, సిసి రోడ్లులు, స్పోర్ట్స్ కాంప్లెక్స్ నిర్మాణానికి సంబంధించిన పలు అంశాలపై ఎమ్మెల్యే దిశానిర్దేశం చేశారు. అదేవిధంగా యూనివర్సిటీలో పని చేస్తున్న సిబ్బంది పడుతున్న ఇబ్బందులు ఎమ్మెల్యే దృష్టికి తీసుకువచ్చారు. దీనిపై స్పందించిన ఎమ్మెల్యే, యూని

నిర్మాణ పనులను పరిశీలిస్తున్న ఎమ్మెల్యే గోపిరెడ్డి శ్రీనివాస రెడ్డి, ఎపి ఎస్‌సిహెచ్‌ఈ చైర్మన్ హేమచంద్రరెడ్డి తదితరులు

వర్సిటీ అధికారుల దృష్టికి తీసుకువెళ్లి సమస్య పరిష్కరిస్తానని హామీ ఇచ్చారు. కార్యక్రమంలో యూనివర్సిటీ ప్రిన్సిపాల్, వైస్ ప్రిన్సిపల్, హెచ్ఒడిలు, అసిస్టెంట్ ప్రొఫెసర్లు తదితరులు పాల్గొన్నారు.

డ్రైవర్లపై పెనాల్టీలు రద్దు చేయాలి

మాట్లాడుతున్న శివాజీ

ప్రజాశక్తి-గుంటూరు

రవాణా రంగ కార్మికులపై పెంచిన ఫెనాల్టీలు, ఫీజులు రద్దు చేయాలని, పెట్రోల్, డీజిల్, గ్యాస్ ధరలు తగ్గించాలని, రవాణా కార్మికులకు సంక్షేమ బోర్డు ఏర్పాటు చేయాలని తదితర డిమాండ్ల పరిష్కారం కోసం అక్టోబర్ 6న జరిగే చలో విజయవాడను జయప్రదం చేయాలని ఆలిండియా రోడ్ ట్రాన్స్‌పోర్టు వర్కర్స్ ఫెడరేషన్ (ఎఐఆర్‌టిడబ్ల్యూఎఫ్) రాష్ట్ర అధ్యక్షులు ఎన్.శివాజి పిలుపునిచ్చారు. రవాణా కార్మికుల ప్రచార జాతా శనివారం గుంటూరు నగరంలో వివిధ ఆటో స్టాండ్‌లు, స్కూల్ ఆటో, మినీ లారీ తదితర స్టాండ్‌లలో ప్రచారం నిర్వహించారు. శివాజీ మాట్లాడుతూ యువకులు ఉన్నత చదువులు చదువుకొని ఉద్యోగాలు లేక ఎవరిపై ఆధారపడకుండా ఆటోలు నడుపుకుంటున్నారని అన్నారు. ప్రభుత్వాల నుండి ప్రోత్సాహకాలు ఇవ్వకపోగా ఆటో డ్రైవర్లపై ఫీజులు, పెనాల్టీలు పెంచి తీవ్ర ఇబ్బందులకు గురి చేస్తున్నారని విమర్శించారు. కేంద్ర ప్రభుత్వం రవాణా చట్టానికి సవరణలు చేయాలని ప్రయత్నిస్తే దేశవ్యాప్తంగా రవాణా రంగ కార్మికులు పెద్ద ఎత్తున ఉద్యమించటంతో కేంద్రం నేరుగా అమలు చేయటం విరమించుకొని, రాష్ట్రాల ద్వారా అమలుకు యత్నిస్తోందని మండిపడ్డారు. దేశంలో ఏ రాష్ట్రంలో లేని విధంగా మన రాష్ట్ర ప్రభుత్వం జిఒ 21 తెచ్చి చిన్న చిన్న తప్పులకు కూడా రవాణా కార్మికులపై అధికా ఫీజులు, పొరపాటున యాక్సిడెంట్ జరిగి ఎవరైనా మరణిస్తే డ్రైవర్‌కు జైలుశిక్ష, లైసెన్స్ రద్దు వంటి శిక్షలు వేస్తుందని అన్నారు. ప్రపంచ మార్కెట్‌లో క్రూడాయిల్ ధరలు తగ్గినా, కేంద్రం, రాష్ట్ర ప్రభుత్వాలు వివిధ పన్నుల పేరుతో పెట్రోలు, డీజిల్ ధరలు పెంచుతున్నాయన్నారు. ఈ విధానాలకు వ్యతిరేకంగా ఆలిండియా రోడ్ ట్రాన్స్‌పోర్టు వర్కర్స్ ఫెడరేషన్, ఆటో డ్రైవర్స్ యూనియన్ (సిఐటియు) ఆధ్వర్యంలో జరిగే పోరాటాల్లో డ్రైవర్లంతా పాల్గొనాలని పిలుపునిచ్చారు. జిల్లా ఆటో డ్రైవర్స్ యూనియన్ జిల్లా అధ్యక్షులు బి.లక్ష్మణరావు మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వం జిఒ 21 తెచ్చి ఆటో డ్రైవర్ల నడ్డి విరిచే ప్రయత్నం చేస్తోందన్నారు. డ్రైవర్ల సమస్యల పరిష్కారానికి అందరూ ఐక్యం కావాలని పిలుపునిచ్చారు. కార్యక్రమంలో జిల్లా ఆటో డ్రైవర్స్ యూనియన్ గౌరవాధ్యక్షులు మస్తాన్‌వలి, గుంటూరు నగర ఆటో డ్రైవర్స్ యూనియన్ ప్రధాన కార్యదర్శి జి.శంకరరావు, సిఐటి యు గుంటూరు నగర తూర్పు, పశ్చిమ ప్రధాన కార్యదర్శులు కె.శ్రీనివాసరావు, బి.ముత్యాలరావు ప్రసంగించారు. అనంతరం హిందూ కాలేజి, మున్సిపల్ ట్రావెలర్స్ బంగ్లా, యూనిటీ ఆటో స్టాండ్, గోరం ట్ల చిల్లీస్ ఆటో స్టాండ్, నల్లచెరువు మినీ లారీ స్టాండ్, గుజ్జనగుండ్ల టాటా ఏసీ స్టాండ్, భాష్యం స్కూల్ ఆటో డ్రైవర్స్ స్టాండు, రైల్వే స్టేషన్, గవర్నమెంట్ హాస్పటల్, బి.ఆర్.స్టేడియం, బస్టాండ్, వాసవీ క్లాత్ మార్కెట్ వివిధ ఆటో స్టాండ్‌లలో ప్రచారం చేశారు.



మాట్లాడుతున్న రవి

ప్రచార యాత్రను జయప్రదం చేయండి

ప్రజాశక్తి - తాడేపల్లి

మంగళగిరి నియోజకవర్గంలో ఈ నెల 3వ తేదీ నుంచి చేపట్టనున్న సిపిఎం ప్రచార చైతన్య యాత్రను జయప్రదం చేయాలని ఆ పార్టీ గుంటూరు జిల్లా కార్యదర్శివర్గ సభ్యులు ఎం.రవి పిలుపునిచ్చారు. శనివారం ఉండవల్లి సెంటర్‌లోని సిపిఎం కార్యాలయంలో జరిగిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. ప్రజలు ఎదుర్కొంటున్న సమస్యలను అర్జీల రూపంలో సిపిఎం నేతలకు ఇవ్వాలని కోరారు. మూడో తేదీ ఉండవల్లి సెంటర్‌లో జరిగే ప్రారంభ సభలో సిపిఎం కేంద్ర కమిటీ సభ్యులు ఎంఎ గఫూర్ పాల్గొంటారని చెప్పారు. 12వ తేదీ వరకు యాత్ర కొనసాగుతుందన్నారు. ఈ నెల 16న మంగళగిరి కార్పొరేషన్ కార్యాలయం ముందు సమస్యల పరిష్కారానికి మహాధర్నా నిర్వహిస్తున్నట్లు చెప్పారు. మూడో తేదీన ఉండవల్లి, పెనుమాక, యర్రబాలెం, కృష్ణనగర్ ప్రాంతాల్లో పాదయాత్ర జరుగుతుందని తెలిపారు. 4న కృష్ణనగర్ నుంచి తాడేపల్లి, 5న క్రిష్టియన్‌పేట, పాతూరు, గుండిమెడ, కుంచనపల్లి, 6న చిర్రావూరు, నూతక్కి, మెల్లెంపూడి, వడ్డేశ్వరం, కొలనుకొండ, 7న ఇప్పటం, తృకూరు, పెదవడ్లపూడి, రేవేంద్ర పాడు, శృంగారపురం, పెదపాలెం, చినపాలెం, 8న పేరకలపూడి, ఈమని, దుగ్గిరాల, మంచికలపూడి, 9న తుమ్మపూడి, చిలువూరు, కాజ, చినకాకాని, రత్నాలచెరువు, 10, 11 తేదీల్లో మంగళగిరి టౌన్, 12న నవులూరు, బేతపూడి, కురగల్లు, నిడమర్రుతో పాదయాత్ర ముగుస్తుందని వివరించారు.

సిపిఎం అభిమాని అబద్దాలు మృతి

ప్రజాశక్తి-తాడేపల్లి

ఉండవల్లికి చెందిన సిపిఎం అభిమాని ఓలేటి అబద్దాలు (85) శనివారం తెల్లవారుజామున అనారోగ్యంతో మృతిచెందారు. ఆయన కుమారుడు శ్రీనివాసరావు ఉండవల్లి సిపిఎం కార్యకర్తగా కొనసాగుతున్నారు. అబద్దాలు భౌతికకాయంపై సిపిఎం రాజధాని డివిజన్ కార్యదర్శి ఎం.రవి, కార్యదర్శి వర్గ సభ్యులు వి.వెంకటేశ్వరరావు పూలమాలలు వేసి నివాళులర్పించారు. నాయకులు ఎం.భాగ్యరాజు, ఈమని రామారావు, సీనియర్ నాయకులు జొన్నా శివశంకరరావు, తాడేపల్లి రూరల్ కార్యదర్శి డి.వెంకటరెడ్డి, రైతు సంఘం రాజధాని డివిజన్ అధ్యక్షులు ఈశ్వరరెడ్డి, పిఎన్ఎం రాష్ట్ర ఉపాధ్యక్షులు గాదె సుబ్బారెడ్డి సంతాపం తెలిపారు.

20 నిముషాలు.. 40 అంశాలు..!

సమావేశంలో నిరసన తెలుపుతున్న టిడిపి సభ్యులు

- చర్చేమీ లేకుండానే అజెండా ఆమోదం
- చంద్రబాబు అరెస్టులపై కౌన్సిల్లో టిడిపి సభ్యుల నిరసన

ప్రజాశక్తి - తెనాలి

మున్సిపల్ కౌన్సిల్ సాధారణ సమావేశం ప్రశాంతంగా ముగిసింది. చైర్‌పర్సన్ సయ్యద్ ఖలేదా నసీం అధ్యక్షతన కౌన్సిల్ హాలులో శనివారం సమావేశం నిర్వహించగా ప్రారంభంలోనే ప్రతిపక్ష నేత పసుపులేటి త్రిమూర్తి ఆధ్వర్యంలో టిడిపి సభ్యులు నోటికి నల్ల రిబ్బన్లు కట్టుకుని నిరసన తెలిపారు. చంద్రబాబు అరెస్టు అప్రజాస్వామికమని, ఆయన్ను తక్షణమే విడుదల చేయాలని కోరుతూ ప్లకార్డులు ప్రదర్శించారు. చైర్ పర్సన్ జోక్యం చేసుకొని కౌన్సిల్ నిబంధనలు సభ్యులంతా పాటించాలని, పార్టీలకు, వ్యక్తులకు సంబంధించిన నిరసనలకు కౌన్సిల్లో అనుమతి లేదని టిడిపి సభ్యులను హెచ్చరించారు. రిబ్బన్లు తొలగించి ప్లకార్డులను కూడా తీసివేయాలని కోరారు. టిడిపి సభ్యులు ఇవేమీ పట్టించుకోపోవడంతో వైసిపి సభ్యులు టి.రామయ్య కలుగజేసుకున్నారు. నిరసనలు వ్యక్తం చేయడం ప్రజాస్వామ్యంలో సాధారణమని, అయితే కౌన్సిల్ నిబంధనలను అతిక్రమించి ప్రదర్శనలు సరికాదని, సమావేశం జరిగేందుకు సహకరించాలని కోరారు. టిడిపి సభ్యులు అడుసుమల్లి వెంకటేశ్వరరావు స్పందిస్తూ మా పార్టీ అధినేతను అక్రమంగా అరెస్టు చేస్తే నిరసన తెలియజేసే హక్కు కూడా లేదా అంటూ ప్రశ్నించారు. ఈ పరిస్థితుల మధ్య చైర్ పర్సన్ మాట్లాడుతూ అజెండా మూడు రోజులు ముందుగానే సభ్యులకు అందజేశామని, అందులోని 40 అంశాలను ఆమోదిస్తున్నట్లు ప్రకటించారు. అనంతరం సమావేశం ముగిసిందంటూ నిష్క్రమించారు. 11:30 గంటలకు ప్రారంభమైన కౌన్సిల్ కేవలం 20 నిమిషాల్లోనే ముగిసింది. అజెండాపై చర్చించకుండానే ఆమోదం ప్రకటించడంపై టిడిపి సభ్యులు విమర్శించారు. కౌన్సిల్ సమావేశంలో కమిషనర్ ఎం.జస్వంత్‌రావు ,వివిధ విభాగాల అధికారులు పాల్గొన్నారు.

కార్మికుల కోసం జీవితాంతం కృషి చేసిన పర్స సత్యనారాయణ

సిఐటియు గుంటూరు తూర్పు నగర కమిటీ మహాసభలో జిల్లా ప్రధాన కార్యదర్శి నేతాజి - నూతన కమిటీ ఎన్నిక

మహాసభలో మాట్లాడుతున్న నేతాజి

ప్రజాశక్తి-గుంటూరు

కార్మిక వర్గ ఐక్యత కోసం జీవితాంతం కృషి చేసిన ధన్యజీవి పర్స సత్యనారాయణ అని సిఐటియు జిల్లా ప్రధాన కార్యదర్శి వై.నేతాజీ అన్నారు. సిఐటియు గుంటూరు తూర్పు నగర కమిటీ మహాసభ పాత గుంటూరు సిఐటియు కార్యాలయంలో టి.రాధా అధ్యక్షతన శనివారం జరిగింది. తొలుత పర్స సత్యనారాయణ చిత్రపటానికి భవన నిర్మాణ కార్మిక సంఘం (సిఐటియు) నగర సీనియర్ నాయకులు ఎన్.మస్తాన్‌రావు పూలమాల వేసి నివాళులర్పించారు. ముఖ్యఅతిథిగా హాజరైన నేతాజీ మాట్లాడుతూ కార్మికులు పోరాడి సాధించుకున్న కార్మిక చట్టాలను కేంద్ర ప్రభుత్వం నిర్వీర్యం చేస్తోందని, ప్రభుత్వ రంగ సంస్థలు దేవాలయాలు అని భారతదేశ మొదటి ప్రధాని నెహ్రూ అంటే, ఇప్పటి ప్రధాని మోడీ మాత్రం ప్రభుత్వ రంగ సంస్థలు పుట్టింది చావటానికేనని అనటం సిగ్గుచేటని మండిపడ్డారు. దేశంలోనే ప్రభుత్వ రంగ సంస్థలన్నింటినీ అంబానీ, అదానీలకు దోచిపెడుతున్నారని విమర్శించారు. భవన నిర్మాణ సంక్షేమ బోర్డులోని నిధులను రాష్ట్ర ప్రభుత్వం నవరత్నాల పేరుతో దారి మళ్లిస్తోందని, ప్రభుత్వం కార్మికులు ఎక్కడా నిరసన గళాలు విప్పకుండా ముందస్తు అరెస్టులు గృహనిర్బంధాలకు పాల్పడుతోందని అన్నారు. ఈ నేపథ్యంలో కార్మికులందరూ ఐక్యమై తమ హక్కులను కాపాడుకోవాలని పిలుపునిచ్చారు. అనంతరం 16 మందితో నూతన కమిటీని ఎన్నుకున్నారు. అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులుగా టి.రాధ, కట్లగుంట శ్రీనివాసరావు, కోశాధికారిగా గండికోట శంకర్రావు ఎన్నికయ్యారు. సిఐటియు పశ్చిమ కమిటీ ప్రధాన కార్యదర్శి బి.ముత్యాలరావు, కార్మికులు టి.శ్రీనివాసరావు, పి.దీవెనరావ్, ముఠా కార్మికులు బి.వెంకటేశ్వర్లు, జోజి, అంగన్వాడీ వర్కర్స్ రోజమ్మ, ఆశా వర్కర్స్ కెజియ, పాల్గొన్నారు.

పోస్టర్ ఆవిష్కరిస్తున్న డిప్యూటీ డిఇఒ, ఇతర అధికారులు

31వ బాలల సైన్స్ కాంగ్రెస్‌పై శిక్షణ

ప్రజాశక్తి-గుంటూరు

జాతీయ బాలల 31వ సైన్స్ కాంగ్రెస్‌పై గుంటూరు జిల్లా సైన్స్ ఉపాధ్యాయులకు శనివారం స్థానిక పరీక్షా భవన్‌లో శిక్షణిచ్చారు. ముఖ్య అతిథిగా హాజరైన ఉపవిద్యాశాఖాధికారి పి.వెంకటేశ్వరరావు మాట్లాడుతూ 31వ జాతీయ బాలల సైన్స్ కాంగ్రెస్ ప్రధానాంశమైన 'ఆరోగ్యం, సంక్షేమం కోసం పర్యావరణ వ్యవస్థను అర్థం చేసుకోవడం' అనే దానిపై వివరించారు. విద్యార్థులను ప్రాజెక్టులకు సిద్ధం చేసి, అక్టోబరు చివరి వారంలో జరిగే జిల్లా స్థాయి సైన్సు కాంగ్రెస్' కు ప్రతి పాఠశాల నుండి ప్రాజెక్టులను ప్రదర్శించి జిల్లా నుంచి రాష్ట్రస్థాయికి విద్యార్థులు ఎంపికయ్యే విధంగా జాగ్రత్తలు తీసుకోవాలని చెప్పారు. ప్రాజెక్టు నిర్వహించే విధానంపై ఎస్‌సిఇఆర్‌టి సైన్స్ ఫ్యాకల్టి డేవిడ్, గౌస్, పల్నాడు జిల్లా అకడమిక్ కో-ఆర్డినేటర్ సీతారామయ్య, రిసోర్స్ పర్సన్ డి.శివశంకరరావు అవగాహన కల్పించారు. అనేకమార్లు ఎన్‌సిఎస్‌సికి గుంటూరు జిల్లా నుంచి జాతీయస్థాయికి ప్రాజెక్టులు సమర్పించిన రాష్ట్ర ఉత్తమ ఉపాధ్యాయ అవార్డు గ్రహీత సిహెచ్.వీరప్పయ్య ప్రాజెక్టు సమర్పించే విధానంపై ఉపాధ్యాయులకు శిక్షణ నిచ్చారు. శిక్షణను ఎపి కాస్ట్ (కౌన్సిల్ ఆఫ్ సైన్స్ అండ్ టెక్నాలజీ) జిల్లా కో-ఆర్డినేటర్ ఎస్.కె.గౌసుల్‌మీరా, జిల్లా సైన్సు అధికారి ఎ.రవికుమార్, అకడమిక్ కో-ఆర్డినేటర్ ఎం.అప్పారావు పర్యవేక్షించారు.

బేస్‌బాల్ రాష్ట్రస్థాయి పోటీలకు మందపాడు జెడ్‌పి విద్యార్థులు

ప్రజాశక్తి- మేడికొండూరు

బేస్‌బాల్ రాష్ట్రస్థాయి పోటీలకు మండలంలోని మందపాడు జెడ్‌పి పాఠశాల విద్యార్థులు ఎంపికైనట్లు హెచ్‌ఎం శాంతా భూలక్ష్మి శనివారం తెలిపారు. స్కూల్ గేమ్స్ ఫెడరేషన్ ఆఫ్ ఇండియా ఆధ్వర్యంలో పొన్నూరు మండలం దొప్పలపూడిలో శుక్రవారం నిర్వహించిన పోటీల్లో అండర్-19 విభాగంలో తమ పాఠశాలకు చెందిన భాను, నరసింహ, ధనరాజు ప్రతిభ చూపి జిల్లా జట్టుకు ఎంపికయ్యారని చెప్పారు. కడపలో త్వరలో నిర్వహించే రాష్ట్రస్థాయి పోటీల్లో వీరు పాల్గొంటారని పిఇటి కె.జయరావు తెలిపారు. ఎంపికైన వారిని పాఠశాల స్థలదాత వి.అప్పిరెడ్డి, ఉపాధ్యాయులు అభినందించారు.

నులకపేట వద్ద ట్రాఫిక్ జామ్

ప్రజాశక్తి-తాడేపల్లి :

పట్టణంలోని నులకపేట శనివారం మధ్యాహ్నం ట్రాఫిక్ జామ్ ఏర్పడింది. వేర్ హౌస్ గిడ్డంగుల సంస్థ ఎదుట లారీ ఇరుక్కుపోవడంతో ఈ పరిస్థితి ఏర్పడింది. అటు మంగళగిరి ఇటు తాడేపల్లి వైపు కిలోమీటరు మేర ట్రాఫిక్ జామ్ ఏర్పడటంతో ప్రయాణికులు ఇబ్బందులు పడ్డారు. రెండు గంటల అనంతరం తాడేపల్లి పోలీసులు ట్రాఫిక్ క్లియర్ చేశారు.

ఆరోగ్య సురక్షను సమర్థవంతంగా నిర్వహించాలి

ప్రజాశక్తి - పల్నాడు జిల్లా

నరసరావుపేట అర్బన్ పరిధిలో బాబా పేట ప్రైమరీ హెల్త్ సెంటర్ లో శనివారం జగనన్న ఆరోగ్య సురక్ష కారక్రమాన్ని కలెక్టర్ ఎల్. శివశంకర్, జాయింట్ కలెక్టర్ శ్యామ్ ప్రసాద్, ఎమ్మెల్యే డాక్టర్ గోపిరెడ్డి శ్రీనివాస్‌రెడ్డి ప్రారంభించారు. రోగులకు వైద్య పరీక్షలు నిర్వహించి, గుర్తింపు కార్డులు మంజూరు చేశారు. రోగులతో ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడారు. కార్యక్రమంలో ట్రైనీ కలెక్టర్ కల్పశ్రీ పాల్గొన్నారు. **ఈపూరు:** కొచ్చర్ల ప్రాథమిక ఆరోగ్య కేంద్రం పరిధిలోని కొండ్రముట్లలో 510 మందికి వైద్య పరీక్షలు నిర్వహించారు. వైద్య శిబిరాన్ని జిల్లా ఇమ్యునైజేషన్ అధికారిణి డి గీతాంజలి పర్యవేక్షించారు. వైద్య శిబిరంలో ఎముకల వైద్య నిపుణులు సాత్విక్,పిల్లల వైద్య నిపుణులు రాంబాబు, కొచ్చెర్ల ప్రాథమిక వైద్య అధికారిణి నాగేంద్రబాబు, ముప్పాళ్ళ ప్రాథమిక ఆరోగ్య కేంద్ర వైద్యాధికారిణి షమీమా రోగులకు వైద్య పరీక్షలు చేశారు. **అమరావతి :** స్థానిక శ్రీ రామకృష్ణ హిందూ హైస్కూల్‌లో 'ఆరోగ్య సురక్ష ' నిర్వహించారు. రాష్ట్ర ఎంపిపిల సంఘం కన్వీనర్, అమరావతి ఎంపిపి మేకల హనుమంతరావు పాల్గొన్నారు. అనంతరం ఐసిడిఎస్ వారు ఏర్పాటు చేసిన స్టాల్స్ ను పరిశీలించారు. పిల్లలకు, గర్భిణులకు, బాలింతలకు అందించే పౌష్టికాహారం పై అంగన్వాడీ సిబ్బందిని ఆరా తీశారు. **మాచర్ల :** స్థానిక నెహ్రూనగర్ అర్బన్ హెల్త్ సెంటర్‌లో ఆరోగ్య సురక్ష కార్యక్రమంలో భాగంగా ప్రత్యేక వైద్య శిబిరం నిర్వహించారు. వైద్య శిబిరాన్ని వైసిపి రాష్ట్ర యువజన సంఘ ప్రధాన కార్యదర్శి పిన్నెల్లి వెంకటరామిరెడ్డి

నరసరావుపేటలోని అర్బన్ ప్రైమరీ హెల్త్ సెంటర్ లో 'ఆరోగ్యసురక్ష' ను ప్రారంభిస్తున్న జెసి ఎ.శ్యామ్‌ప్రసాద్,ఎమ్మెల్యే గోపిరెడ్డి శ్రీనివాసరెడ్డి

ప్రారంభించారు. కార్యక్రమంలో మున్సిపల్ చైర్మన్ మాచర్ల చినఏసోబు, కమిషనర్ ఇవి రమణబాబు, వైస్ చైర్మన్ పోలూరి నరసింహారావు తదితరులు పాల్గొన్నారు. **విజయపురిసౌత్:** మాచర్ల మండలంలోని గన్నవరం సచివాలయం పరిధిలో ఆరోగ్య సురక్ష కార్యక్రమాన్ని ముఖ్య అతిథి మాచర్ల మండల పరిషత్ అధ్యక్షులు బూడిద శ్రీనివాసరావు ప్రారంభించారు. గర్భిణులకు హెల్త్ కిట్లను అందజేశారు.కార్యక్రమంలో మండల ప్రత్యేక అధికారి గబ్రు నాయక్ , తహశీల్దార్ హుసేన్,ఎం.పి.డి.ఓ సరోజిని దేవి తదితరులు పాల్గొన్నారు. **యడ్లపాడు:**మండలంలోని కారుచోలలో జగనన్న ఆరోగ్య సురక్ష నిర్వహించారు. జడ్పీ హైస్కూల్,యూపీ పాఠశాల ఒకే ప్రాంగణంలో ఉన్నప్పటికీ జడ్పీ వరకు మాత్రమే సెలవు ప్రకటించి, యుపి స్కూల్ విద్యార్థులకు యథావిధిగా తరగతులు కొనసాగించారు. దీంతో యూపీ పాఠశాలలోనే వైద్య సిబ్బంది వివిధ రకాల పరీక్షలు రోగులకు నిర్వహిస్తుండగా పక్కనే ఉన్న చిన్నారులు మధ్యాహ్నం భోజనం చేయాల్సి వచ్చింది. పిల్లలకు సెలవు ఇవ్వకుండా ఈవిధంగా చేయ డంపై మండిపడ్డారు. ఈ విషయం గ్రహించిన అధి కారు లు, భోజనాల అనంతరం విద్యార్థులను ఇళ్ళకు పంపిం చారు. అదే ప్రాంగణంలో ఉన్న అంగన్వాడీ కేం ద్రానికి సెలవు ప్రకటించకపోవడాన్ని గ్రామస్తులు తప్పు పడుతున్నారు.

ప్రారంభిస్తున్న మంత్రి విడదల రజిని, చిత్రంలో కలెక్టర్ తదితరులు

శ్రీ హాస్పిటల్‌లో అధునాతన వైద్య సదుపాయాలు

ప్రజాశక్తి-చిలకలూరిపేట

రాష్ట్ర ప్రభుత్వం దేశవ్యాప్తంగా జరిగే ఆరోగ్య కార్యక్రమాలతో ముందంజలో ఉంటూ జగనన్న ఆరోగ్య సురక్షకు నాంది పలకడం జరిగిందని రాష్ట్ర ఆరోగ్యశాఖ మంత్రి విడుదల రజిని అన్నారు. చిలకలూరిపేట లోని శ్రీ హాస్పిటల్ లో శనివారం అధునాతన వైద్య సదుపాయాల ప్రారంభోత్సవ కార్యక్రమానికి ఆమె ముఖ్యఅతిథిగా పాల్గొన్నారు. లూసిడ్లీ ఇంటిగ్రేటెడ్ వైటల్ కేర్ లో ఎమర్జన్సీ లైవ్ తో పాటు అధునాతన టెక్నాలజీతో ఏర్పాటు చేసిన స్మార్ట్ ఐసియు ని పల్నాడు జిల్లా కలెక్టర్ శివశంకర్‌తో కలిసి మంత్రి ప్రారంభించారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ క్లిష్టమైన అనారోగ్య సమస్యలతో ఉన్న పేషంట్లు పరిస్థితిని ప్రతి నిమషం క్రిటికల్ కేర్ వైద్యులకు అనుసంధానం చేయడంతో పాటు స్వయంచాలకంగా వాళ్ళ ఆరోగ్య పరిస్థితిని మెరుగు పరచటానికి అధునాతన పరికరాలు సహాయ పడతాయి అన్నారు. ఇన్బిల్ మెషీన్ లెర్నింగ్ ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్ ను ఉపయోగించి డిటెరియోరేషన్ ఇండెక్స్ అనే కొలమానం తో పేషంట్ ఆరోగ్య పరిస్థితిని, క్లినికల్ ఎవాల్యుయేషన్ రెగ్యులర్ రౌండ్ల ద్వారా గుర్తించడంలో శ్రీ హాస్పిటల్ లోని డాక్టర్ కల్యాణ చక్రవర్తి బృందానికి సహాయపడుతోందన్నారు.

సదస్సు లో మాట్లాడుతున్న బొర్రా అప్పారావు

సబ్‌ప్లాన్ నిధులు దారిమళ్లించి మోసం

ప్రజాశక్తి-సత్తెనపల్లి రూరల్

ఎస్సీ,ఎస్టీ సబ్ ప్లాన్ నిధులను జగన్ ప్రభుత్వం దారి మళ్ళించి దళిత గిరిజనులను మోసం చేస్తుందని జనసేన పార్టీ నియోజకవర్గ నాయకులు బొర్రా వెంకట అప్పారావు విమర్శించారు. పట్టణంలోని జనసేన కార్యాలయంలో జనసేన ఆద్వర్యంలో ఎస్సీ ఎస్టీల ఆత్మీయ సమావేశంలో శనివారం నిర్వహించారు. ఈ సందర్భంగా అప్పారావు మాట్లాడుతూ దళితులను రాజకీయ పార్టీలు ఓటు బ్యాంకుగా చూస్తున్నారే తప్ప వారికి న్యాయం చేయటం లేదన్నారు. రాష్ట్రంలో దళిత గిరిజనులపై దాడులు దౌర్జన్యాలు ఎక్కువైపోయాయని అన్నారు. రాష్ట్రంలో అంబేద్కర్ రాజ్యాంగం అమలు కావడం లేదని, ప్రజా వ్యతిరేక విధానాలు అలంబిస్తున్న ప్రభుత్వానికి తగిన వచ్చే. ఎన్నికల్లో గుణపాఠం చెప్పాలని పిలుపునిచ్చారు. కార్యక్రమంలో పెన్నా-కృష్ణా పెన్నా నదులు కన్వీనర్ పార్వతి నాయుడు,7వ వార్డు కౌన్సిలర్ రంగిశెట్టి సుమన్ కుమార్, జనసేన పార్టీ జిల్లా కన్వీనర్ కొమ్మిశెట్టి సాంబశివరావు, రూరల్ మండల కన్వీనర్ నాదెండ్ల నాగేశ్వరావు, బత్తుల కేశవ ,తోట నరసయ్య , శిరిగిరి పవన్,ఎంపిటిసి విమల, శివ ,మనోహర్, శీను నాయక్, శిరోమణి, సత్య పూర్ణ ఏసుబాబు సురేష్,, బిట్రగుంట కృష్ణ, రుద్రయ్య ,సంపత్ ,సుగాలి కాలనీ నాయక్ లు తదితరులు పాల్గొన్నారు.

జాతీయ లైవ్‌స్టాక్ మిషన్‌పై రైతులకు అవగాహన

ప్రజాశక్తి - పల్నాడు జిల్లా

జాతీయ లైవ్ స్టాక్ మిషన్ పై రైతులకు అవగాహన కల్పించడం, ప్రోత్సహించడం ద్వారా వ్యవసాయ అనుబంధ రంగాల ద్వారా రైతులు ఆర్థికాభివృద్ధి సాధించే విధంగా తయారు చేయాలని పశు సంవర్ధక శాఖ అధికారులను జిల్లా జాయింట్ కలెక్టర్ ఎ.శ్యాం ప్రసాద్ ఆదేశించారు. పట్టణంలోని ప్రకాష్ నగర్ లో గల భువనచంద్ర టౌన్ హాల్ లో శనివారం జాతీయ లైవ్ స్టాక్ మిషన్ పై రైతు లకు అవగాహనా సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా జాయింట్ కలెక్టర్ మాట్లాడుతూ గొర్రెలు,మేకల శాస్త్రీయ నిర్వహణ, పందుల పెంపకం,పౌల్ట్రీ ఫామ్ నిర్వహణ వంటి కీలకమైన అంశాలపై దృష్టి సారించి స్వయం ఉపాధి అవకాశాలు సాధించాలని కోరారు. రూ .1 కోటి అంచనా వేసిన ప్రాజెక్టుకు 50 శాతం రాయితీ రుణాలు అందించడం ఈ ప్రాజెక్ట్ యొక్క ముఖ్య ఉద్దేశ్యమని, రైతులు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. జిల్లా వ్యవసాయ మండలి చైర్మన్ కర్రి సాయి మార్కెండేయ రెడ్డి, గొర్రెల పెంపకందారుల సహకార సంఘం చైర్మన్ బూడిద సైదులు మాట్లాడుతూ జంతువుల ఉత్పాదకతను

పెంచడం, మాంసం, గుడ్లు, మేక పాలు, ఉన్ని, మేత ఉత్పత్తిని మెరుగుపరచడం ద్వారా చాలా ఉపాధి అవకాశాలు, ఆర్థిక శక్తి ని పెంచుకోవచ్చున్నారు. రాయితీలను అందిపుచ్చుకోవాలని రైతులు మెరుగైన జీవనం సాగించాలని ఆశాభావం వ్యక్తం చేశారు. జిల్లా పశుసంవర్ధక శాఖ అధికారి డాక్టర్ కె.కాంతారావు, డిప్యూటీ డైరెక్టర్ పి.రామారావు, డివిజనల్ అసిస్టెంట్ డైరెక్టర్ సిహెచ్. నరసింహులు మాట్లాడుతూ ఉపాధి అవకాశాలను సృష్టించేందుకు సన్న జీవాల పెంపకం, పౌల్ట్రీ, పందుల పెంపకం మరియు పశు గ్రాసం రంగాలలో వ్యవస్థాపకతను పెంపొందించాలన్నారు. ఆధునిక వ్యవసాయ పద్ధతులను పాటించడానికి, సుస్థిరతను పెంచాలన్నారు. కార్యక్రమంలో 700 మంది పశువుల పెంపకందారులు పాల్గొన్నారు.

ప్రభుత్వ పాఠశాలల్లో విద్యార్థినులకు 'విజ్ఞాన్' అవగాహనా సదస్సులు

ప్రజాశక్తి - పల్నాడు జిల్లా

విద్యావేత్త విజ్ఞాన్ సంస్థల అధినేత, ఎంపి లావు శ్రీ కృష్ణ దేవరాయలు ప్రభుత్వ పాఠశాలలు అభివృద్ధి చెందాలన్న ఆకాంక్షతో ప్రభుత్వ పాఠశాలలని తరుచూ సందర్శించి వాటి అభివృద్ధికి కృషి చేస్తున్నారు. ప్రభుత్వ పాఠశాలల్లో ఉపాధ్యాయుల కొరత ఉండటంతో దీనిని పరిష్కరించేలా ' విద్యవాలంటీర్లు' అనే కొత్త కార్యక్రమాన్ని చేపట్టి, స్వచ్ఛంద సంస్థల సహకారంతో విజ్ఞాన్ సంస్థల ద్వారా పల్నాడులోని ఆయా గ్రామాల్లో డిగ్రీలు చదివిన యువతకు శిక్షణ ఇచ్చి, వేతనాలు ఇచ్చి విద్యార్థులకు బోధన చేయిస్తున్నారు. తద్వారా ప్రభుత్వ పాఠశాలల్లో విద్యార్థుల చేరికలు పెరిగాయి. విజ్ఞాన్ సంస్థల్లోని అనుభవం కలిగిన అధ్యాపకులని, సమాజ సేవ చేయాలన్న విద్యార్థులను బృందాలుగా పల్నాడు లోని ప్రభుత్వ పాఠశాలకు పంపి విద్యార్థిణులకి విభిన్న అంశాలపై అవగాహన కల్పించేలా కృషి చేస్తున్నారు. ప్రభుత్వ పాఠశాలల్లో 6వ తరగతి నుండి 10వ తరగతి

చదివే విద్యార్థినులకు బాల్య వివాహాలపై, లింగ వివక్షతపై, ముఖ్యంగా క్యాన్సర్ వ్యాధిపై, విద్య యొక్క ఆవశ్యకతలపై పవర్ పాయింట్ ప్రజెంటేషన్ ద్వారా అవగాహన కల్పిస్తున్నారు. ఇప్పటి వరకు నరసరావుపేట నియోజకవర్గం లోని 18 జిల్లా పరిషత్ పాఠశాలల్లోని విద్యార్థులకు అవగాహనా తరగతులు నిర్వహించారు.

ప్రస్తుతం సత్తెనపల్లి నియోజకవర్గంలో ఈ కార్యక్రమం జరుగుతుంది.ఇలాగే ఈ కార్యక్రమాన్ని పల్నాట ఉన్న అన్ని జిల్లా పరిషత్ పాఠశాలల్లో జరిగేలా ప్రణాళికను రూపొందించారు. ఈ కార్యక్రమాల ద్వారా విద్యార్థుల్లో మార్పు తీసుకుని రావాలన్నదే తన లక్ష్యం అని ఎంపి పేర్కొన్నారు.

ఉచిత వైద్య శిబిరం నిర్వహిస్తున్న ఎంఎఎం గ్రూప్ కళాశాల

ఎంఎఎం గ్రూప్ ఆఫ్ కళాశాలలో ఉచిత వైద్య శిబిరం

ప్రజాశక్తి - పల్నాడు జిల్లా

మండలంలోని కేసనపల్లి గ్రామ పరిధిలోని మేదర మెట్ల అంజమ్మ మస్తాన్‌రావు గ్రూపు ఆఫ్ కళాశాలలో శనివారం నేషనల్ సర్వీస్ స్కీమ్ ఆధ్వర్యంలో కోనాక్ డయాగ్నస్టిక్స్ సహాయ సహకారాలతో ఉచిత వైద్య శిబిరం నిర్వహించారు. ఈ వైద్య శిబిరాన్ని కళాశాలల సెక్రటరీ అండ్ కరస్పాండెంట్ ఎంఆర్ శేషగిరిరావు ప్రారం భించారు. ఈ సందర్భంగా శేషగిరిరావు మాట్లాడుతూ ఆరోగ్యమే మహాభాగ్యం అని వ్యాధి వచ్చిన తర్వాత చికిత్స చేయించుకోవడం కంటే రాకముందే నివారణ చర్యలు తీసుకోవడం ఎంతో మేలని చెప్పారు. ఈ శిబిరంలో కళాశాలల అనుబంధ సంస్థల అధ్యాపక, అధ్యాపకేతర సిబ్బందికి ఉచిత మధుమేహం మరియు బిపి, షుగర్ వంటి సాధారణ వ్యాధులకు పరీక్షలు నిర్వహించారు. ఎంఎఎం ఇంజనీరింగ్ కళాశాల డైరెక్టర్ దరువురి శ్రావ్య, కృష్ణవేణి ఇంజనీరింగ్ కళాశాల ప్రిన్సిపల్ డాక్టర్ ఎస్ రామారావు, ఫార్మసీ కళాశాల ప్రిన్సిపల్ డాక్టర్ ఎం ప్రసాదరావు, ఎన్ఎస్ఎస్ ప్రోగ్రాం ఆఫీసర్స్ , అధ్యాపక, అధ్యాపకేతర సిబ్బంది, ఎన్ఎస్ఎస్ వాలంటీర్లు పాల్గొన్నారు.

నిరుపేదలకు పట్టెడన్నం పెడదాం

ప్రజాశక్తి-అమరావతి

పెదకూరపాడు మండలంలో వివిధ రకాల ఫంక్షన్లు చేసు కున్నవారు మిగిలిపోయిన ఆహారాన్ని తమకి అందిస్తే, తమ సేవాదళం ద్వారా నిరుపేదలకు పంచి పెడతామని కాంగ్రెస్ జిల్లా యువజన అధ్యక్షులు గంట గోపి అన్నారు. 9705078403 నంబర్‌కు తెలియజేస్తే తమ సేవాదళం వచ్చి తీసుకుని వెళ్లి నిరుపేదలు అభాగ్యులకు అందజేస్తుందని గంట గోపి తెలిపారు.

ఆరోగ్య సురక్ష క్యాంప్‌లు ప్రారంభం

ప్రజాశక్తి-గుంటూరు

రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా చేపడుతున్న జగనన్న ఆరోగ్య సురక్ష కార్యక్రమాన్ని ప్రజలు వినియోగించుకోవాలని జిల్లా కలెక్టర్ ఎం.వేణుగోపాల్‌రెడ్డి అన్నారు. శనివారం గుంటూరు నగరపాలక సంస్థ పరిధిలోని ఇజ్రాయిల్‌పేటలో ఆరోగ్య సురక్ష క్యాంప్‌ను నగర కమిషనర్ కీర్తి చేకూరి, ఎమ్మెల్యే మద్దాలి గిరిధర్‌తో కలిసి కలెక్టర్ ప్రారంభించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ వైద్య పరీక్షలతో పాటుగా అవసరమైన వారికి ఆరోగ్యశ్రీ ద్వారా ఉచితంగా మెరుగైన చికిత్స, మందులు అందిస్తారన్నారు. కంటికి సంబంధించిన వైద్య సేవలు కూడా అందుబాటులో ఉన్నాయన్నారు. క్యాంపుల్లో విధులు కేటాయించబడిన సిబ్బంది ఓర్పుతో ప్రజలకు రిజిస్ట్రేషన్, వైద్య పరీక్షలు, ఫార్మశీ వివరాలు చెప్పాలని సూచించారు. కమిషనర్ మాట్లాడుతూ నగరంలోని 29 పట్టణ ఆరోగ్య కేంద్రాల్లో క్యాంప్‌ల ఏర్పాటుకు చర్యలు తీసుకున్నామన్నారు. క్యాంపుల్లో జనరల్ మెడిసిన్ స్పెషలిస్ట్, గైనకాలజిస్ట్‌తో పాటు ఇద్దరు ఎంబిబిఎస్ వైద్యులు అందుబాటులో ఉంటారని తెలిపారు. వైద్య పరీక్షలు చేసి, అవసరమైతే అందుబాటులోని హాస్పిటల్‌లో చేర్చి చికిత్స అందిస్తారని, ఆరోగ్యశ్రీ ద్వారా కూడా ఉచితంగా శస్త్ర చికిత్సలు చేస్తారని అన్నారు. ఎమ్మెల్యే మాట్లాడుతూ ఆరోగ్యశ్రీలో గతం కంటే ఎక్కువ వ్యాధులకు చికిత్స అందుతోందన్నారు. కార్యక్రమంలో డిప్యూటీ మేయర్ షేక్ సజిలా, జిల్లా వైద్య,ఆరోగ్య శాఖాధికారి డాక్టర్ శ్రావణబాబు, సిటీ ప్లానర్ ప్రదీప్‌కుమార్, డిప్యూటీ కమిషనర్లు బి.శ్రీనివాసరావు, టి.వెంకటకృష్ణయ్య, సిహెచ్.శ్రీనివాస్, ఎంహెచ్‌ఒ డాక్టర్ భానుప్రకాష్ పాల్గొన్నారు.

క్యాంప్‌ను సందర్శించిన మేయర్

జగనన్న ఆరోగ్య సురక్షతో ప్రతిఒక్కరికీ ఆరోగ్య భరోసా లభిస్తుందని నగర మేయర్ కావటి శివనాగ మనోహర్ నాయుడు అన్నారు. ఇజ్రాయెల్‌పేట హెల్త్ సెంటర్‌లో ఏర్పాటు చేసిన ఆరోగ్య సురక్ష కేంద్రాన్ని మేయర్ సందర్శించారు. కార్యక్రమంలో స్థానిక కార్పొరేటర్ ఎం.అంజలి సత్యనారాయణ, పాల్గొన్నారు.

ప్రజాశక్తి-కొల్లిపర

మండల కేంద్రమైన కొల్లిపరలోని క్యాంప్‌ను ఎమ్మెల్యే శివకుమార్, జెడ్‌పి చైర్‌పర్సన్ హెనీక్రిస్టినాతో కలిసి కలెక్టర్ ప్రారంభించారు. ఎంపిపి బి.పద్మావతి, వైసిపి మండల అధ్యక్షులు ఎ.పోతురెడ్డి, డాక్టర్ లక్ష్మీ సుధా, డాక్టర్ ప్రియాంక, ఎంపిడిఒ విజయలక్ష్మి పాల్గొన్నారు.

ప్రజాశక్తి-పొన్నూరు రూరల్, చేబ్రోలు

పట్టణంలోని 23 వార్డు ఇందిరా నగర్ అర్బన్ హెల్త్ సెంటర్లో, చేబ్రోలులో ఏర్పాటు చేసిన వైద్యశిబిరాలను ఎమ్మెల్యే కిలారు వెంకట రోశయ్య ప్రారంభించారు. పొన్నూరులో మున్సిపల్ కమిషనర్ నయీమ్ అహ్మద్ అధ్యక్షతన నిర్వహించిన సభలో ఎమ్మెల్యే మాట్లాడుతూ కోటిన్నర మందికిపైగా వైద్యసేవలు అందించే లక్ష్యాన్ని రాష్ట్ర ప్రభుత్వం పెట్టుకుందన్నారు. 64 రకాల పరీక్షలు ఉచితంగా చేస్తారని, అవసరమైన వారికి నెలకు సరిపడా మందులు ఇస్తారని తెలిపారు. 15 రోజులకు ఒకసారి ఇలాంటి శిబిరాలు నిర్వహిస్తామన్నారు. అనంతరం కంటి పరీక్షలు చేయించుకున్న వారికి ప్రభుత్వం అందజేసిన కళ్ల జోళ్లను ఎమ్మెల్యే పంపిణీ చేశారు.

ప్రజాశక్తి - పెదనందిపాడు రూరల్

స్థానిక జెడ్‌పి పాఠశాలలో శిబిరంలో 423 మందికి వివిధ రకాల పరీక్షలు చేసి ఆయుష్మాన్ భవ కార్డులను అందజేశారు. మండల వైద్యాధికారి డాక్టర్ బి.వి.రత్నకుమార్, మండల ప్రత్యేక అధికారి మనోరంజని, తహశీల్దార్ మహబూబ్ సుభాని, ఎంపిడిఒ రాజగోపాల్ ఇఒ నాగయ్య, సిహెచ్‌ఒ స్వామి పాల్గొన్నారు.

కొల్లిపర శిబిరంలో కలెక్టర్, ఎమ్మెల్యే

ప్రజాశక్తి - కాకుమాను

మండలంలోని కొండపాటూరు జెడ్‌పి పాఠశాలలో శిబిరాన్ని ఎంపిపి ఆర్.శ్రీనివాసరావు ప్రారంభించారు. జెడ్‌పిటిసి ముజావర్ గుల్జార్ బేగం, ఎంపిటిపి ఎన్.సౌజన్య, ఎస్సీ కార్పొరేషన్ ఇడి టి.ప్రేమకుమారి, తహశీల్దార్ ప్రసాదరావు, ఎంపిడిఒ రామకృష్ణ, పాల్గొన్నారు.

ప్రజాశక్తి - దుగ్గిరాల

స్థానిక నిమ్మగడ్డ ఫౌండేషన్ బాలుర ఉన్నత పాఠశాలలో నిర్వహించిన వైద్య శిబిరంలో దాదాపు 300 మందికి పరీక్షలు చేసి మందులు అందించారు. క్లిష్టమైన సమస్యలున్న వారిని మెరుగైన వైద్యం కోసం పెద్ద ఆసుపత్రికి పంపిస్తామని డాక్టర్ అబ్దుల్ రెహమాన్ తెలిపారు. గుంటూరు ప్రభుత్వ ఆసుపత్రికి చెందిన డాక్టర్ ప్రభాకర్ డాక్టర్ శివ, డాక్టర్ షేక్ తాజుద్దీన్, దుగ్గిరాల, ఈమని పిహెచ్‌సి వైద్యులు ఇందిరా, సుకన్య వైద్యసేవలు అందించారు. ఎంపిపి డి.సంతోష రూప వాణి, జెడ్‌పిటిసి ఎం.అరుణ, సర్పంచ్ బి.ఖుషిబాయి పాల్గొన్నారు.

ప్రజాశక్తి - మేడికొండూరు

స్థానిక జెడ్‌పి పాఠశాలలో వైద్య శిబిరాన్ని వైసిపి తాడికొండ నియోజకవర్గ సమన్వయకర్త కత్తెర సురేష్ కుమార్ ప్రారంభించారు. ఎంపిపి ఎం.స్వప్న, జెడ్‌పిటిసి కె.సిద్దయ్య, వైసిపి మండల అధ్యక్షులు టి.వంశీకృష్ణ, రాజశేఖర్, అబ్బాస్, బాజీ పాల్గొన్నారు.



శ్రీశైలం దేవస్థానం ఈవో పెద్దిరాజుకు సత్కారం

ప్రజాశక్తి - మంగళగిరి

శ్రీశైలం శ్రీ భ్రమరాంబ మల్లికార్జునస్వామి దేవస్థానంలో ఇటీవల నూతనంగా దేవస్థానం కార్యనిర్వహణాధికారిగా బాధ్యతలు చేపట్టిన పెద్దిరాజు దంపతులను మంగళగిరికి చెందిన మార్కెట్ యార్డు మాజీ వైస్‌చైర్మన్ మన్నెం రమేష్, అనిత దంపతులు శనివారం ఆయన కార్యాలయంలో ఘనంగా సత్కరించారు. కార్యక్రమంలో డాక్టర్ ఎం.గీత పాల్గొన్నారు.

మోకాళ్లపై రాజధాని రైతుల నిరసన

ప్రజాశక్తి - తుళ్లూరు

రాజధాని నిర్మాణం నిలిపి వేయడంతో ఉపాధి అవకాశాలు లేక, మరోవైపు కౌలు రాక తీవ్ర ఇబ్బందులు పడుతున్నామని అసైన్డ్ రైతులు ఆవేదన వ్యక్తం చేశారు. విచారణ పేరుతో ఏళ్ల తరబడి కౌలు చెల్లించకుండా అసైన్డ్ రైతులైన దళితులు, ఇతర పేదలను ప్రభుత్వం వంచనకు పాల్పడిందని ఉద్దండరాయునిపాలెంకు చెందిన అసైన్డ్ రైతు పులి చిన్నా, మరికొందరు వాపోయారు. ప్రభుత్వం తీరును ఖండిస్తూ శనివారం శిబిరం వద్ద మోకాళ్లపై నిరసన తెలిపారు. చంద్రబాబు ప్రభుత్వం వస్తేనే మాకు న్యాయం జరుగుతుందని ప్లకార్డులు ప్రదర్శించారు. ఇదిలా ఉండగా రాష్ట్ర ఏకైక రాజధానిగా అమరావతిని కొనసాగించాలంటూ రైతులు, మహిళలు చేస్తున్న దీక్షలు 1383వ రోజుకు చేరాయి. తుళ్లూరు, నెక్కల్లు, అనంతవరం, వెంకటపాలెం తదితర గ్రామాల్లో దీక్షలు సాగాయి.

ర్యాగింగ్ కాదు.. చదువుపై కేంద్రీకరించండి..



మాట్లాడుతున్న న్యాయమూర్తి స్వాతి

ప్రజాశక్తి-గుంటూరు లీగల్

యాంటీ ర్యాగింగ్‌పై కాటూరి మెడికల్ కాలేజి, ఆర్‌విఆర్ అండ్ జెసి ఇంజినీరింగ్ కాలేజీల్లో శనివారం జిల్లా న్యాయసేవాధికార సంస్థ ఆధ్వర్యంలో స్పెషల్ డ్రైవ్ నిర్వహించారు. కాటూరి మెడికల్ కాలేజిలో జరిగిన న్యాయవిజ్ఞాన సదస్సులో గుంటూరు 2వ అదనపు జూనియర్ సివిల్ జడ్జి స్వాతి మాట్లాడుతూ విద్యార్థులు ర్యాగింగ్‌పై అవగాహన కలిగి ఉండాలని, ర్యాగింగ్ చట్ట విరుద్ధమన్నారు. ఆర్‌విఆర్‌లో జరిగిన సదస్సులో గుంటూరు ఎక్సైజ్ కోర్టు మేజిస్ట్రేట్ స్పందన మాట్లాడుతూ ర్యాగింగ్ పర్యవసానాల గురించి వివరించారు. ర్యాగింగ్‌కు పాల్పడిన వారికి కఠిన చర్యలు, శిక్షలు ఉంటాయని, అలాంటి శిక్షలు పడితే విద్యార్థులు భవిష్యత్ పాడవుతుందని వివరించారు. కార్యక్రమంలో కాటూరి మెడికల్ కాలేజి ప్రిన్సిపాల్ కాటూరి సుబ్బారావు, ఆర్‌విఆర్ ప్రిన్సిపాల్ కొల్లా శ్రీనివాసరావు, మాజీ అదనపు పబ్లిక్ ప్రాసిక్యూటర్, ప్యానల్ అడ్వకేట్ కట్టా కాళిదాసు, అధ్యాపకులు, విద్యార్థులు పాల్గొన్నారు.

ప్రజాశక్తి - మేడికొండూరు

ర్యాగింగ్ నివారణలో భాగంగా మండలంలోని డోకిపర్రు సమీపంలో ఉన్న యూనివర్సల్ ఇంజినీరింగ్ కాలేజీలో విద్యార్థులకు శనివారం అవగాహన సదస్సు నిర్వహించారు. ముఖ్యఅతిథిగా హాజరైన గుంటూరు జూనియర్ సివిల్ జడ్జి పొన్నూరు బుజ్జి మాట్లాడుతూ ర్యాగింగ్‌కు పాల్పడితే పడే శిక్షలను వివరించారు. మాదక ద్రవ్యాలకు దూరంగా ఉండాలని, చదవుపై దృష్టిని కేంద్రీకరించి స్నేహపూరిత వాతావరణంలో వికాసం పొందాలని సూచించారు. అత్యవసర సమయాల్లో దిశ యాప్‌ను ఉపయోగించుకుని రక్షణ పొందాలన్నారు. కాలేజి ప్రిన్సిపాల్ డాక్టర్ సిహెచ్ కేశవరెడ్డి మాట్లాడుతూ ర్యాగింగ్‌ను నియంత్రించడంలో కళాశాల యాంటీ ర్యాగింగ్ కమిటీ పనితీరును ప్రశంసించారు. కార్యక్రమంలో అడ్వకేట్ కె.శ్రీరామ్, యాంటీ ర్యాగింగ్ కో-ఆర్డినేటర్ జి.మర్రెడ్డి, ఎం.రత్నం, అధ్యాపకులు పాల్గొన్నారు.

పేరేచర్లలో నా భూమి నా దేశం

ప్రజాశక్తి - మేడికొండూరు : మండలంలోని పేరేచర్ల ఇంటెల్ హైస్కూల్‌లో శనివారం నా భూమి నా దేశం కార్యక్రమం నిర్వహించారు. ఇంటింటికీ వెళ్లి బియ్యం, మట్టిని సేకరించి పంచ్ ప్రాణ ప్రతిజ్ఞ చేశారు. పేస్ ఫౌండేషన్ సెక్రెటరీ పోరుపల్లి రమేష్ మాట్లాడుతూ ఢిల్లీలో ఉన్న కర్తవ్యపథ్‌లో నిర్వహించబోయే జాతీయ స్థాయి కార్యక్రమంలో దాదాపుగా 75 వేల మంది సమక్షంలో అక్టోబర్ చివరి వారంలో స్వామి వివేకనంద విగ్రహం వద్ద వేల గ్రామాల నుండి సేకరించిన మట్టిని, బియ్యాన్ని ఇస్తారని చెప్పారు. స్కూల్ డైరెక్టర్ డాక్టర్ కె.జయకుమార్ మాట్లాడుతూ అన్ని గ్రామాల్లో జరుగుతున్న కార్యక్రమాల్లో అందరూ పాల్గొనాలని కోరారు. ప్రిన్సిపల్ కె.రాణి జయకుమార్, పీఈటి హుస్సేన్, పేస్ సొసైటీ ఫౌండర్ ప్రెసిడెంట్ జి.శిరీష పాల్గొన్నారు.

సువర్ణకల్పనను పరామర్శించిన నగర మేయర్

ప్రజాశక్తి-గుంటూరు : రోడ్డు ప్రమాదానికి గురైన సచివాలయ కార్యదర్శి సువర్ణ కల్పనకు అండగా ఉంటామని మేయర్ కావటి శివనాగ మనోహర్ నాయుడు అన్నారు. 156వ సచివాలయంలో ఎడ్యుకేషన్ కార్యదర్శిగా విధులు నిర్వహిస్తూ సువర్ణకల్పన రోడ్డు ప్రమాదానికి గురై లలితా హాస్పిటల్‌లో చికిత్స పొందుతున్న ఆమెను మేయర్ శనివారం పరామర్శించారు. ప్రభుత్వం, కార్పొరేషన్ నుండి అవసరమైన సహాయ సహకారలు అందిస్తామని చెప్పారు.

తలసేమియా బాధితుల కోసం నేడు రక్తదాన శిబిరం

ప్రజాశక్తి - పొన్నూరు రూరల్

తలసేమియా వ్యాధితో బాధపడుతున్న చిన్నారుల కోసం నేషనల్ వాలంటరీ బ్లడ్ డొనేషన్ డే సందర్భంగా పొన్నూరు పట్టణంలో ఆదివారం మెగా రక్తదాన శిబిరాన్ని ఏర్పాటు చేస్తున్నట్లు 'మన పొన్నూరు బ్లడ్ వెల్ఫేర్ అసోసియేషన్ అధ్యక్షులు టి.ఉమాశంకర్ తెలిపారు. ఈ మేరకు శనివారం ఆయన విలేకర్లతో మాట్లాడుతూ 50 కిలోలకు పైగా బరువు ఉండి, 18-60 ఏళ్లున్న ఆరోగ్య వంతులంతా రక్తదానం చేయొచ్చని చెప్పారు. రక్తదానం వల్ల సమస్యలేమీ రావని, ప్రతి 3 నెలలకూ ఒకసారి చేయొచ్చని తెలిపారు. తలసేమియాతో బాధపడుతున్న చిన్నారులకు ప్రతి 15 రోజులకు ఒకసారి రక్తం ఎక్కించాల్సి ఉంటుందని, లేకుంటే వారు చనిపోయే ప్రమాదం ఉంటుందని అన్నారు. రక్తదానాన్ని అందరూ సామాజిక బాధ్యతగా గుర్తించాలని కోరారు. రక్తదాన శిబిరాన్ని స్థానిక ఐలాండ్ సెంటర్లో ఉదయం 9 గంటల నుండి మధ్యాహ్నం రెండు గంటల వరకు నిర్వహిస్తామని, దాతలు 8333089722 ఫోన్ నంర్లకు సంప్రదించాలని కోరారు.

నేడు ఆరోగ్య భీమా ఉచిత రిజిస్ట్రేషన్

ప్రజాశక్తి - తెనాలి

ఆయుష్మాన్ భారత్ డిజిటల్ మిషన్ ద్వారా కేంద్ర ప్రభుత్వం ఆర్థికంగా వెనుకబడిన అన్నివర్గాల ప్రజలకు అందజేస్తున్న రూ.5 లక్షల ఆరోగ్య బీమా సౌకర్యం కోసం స్థానిక సుల్తానాబాద్ రత్న ఫార్చ్యూన్ కళ్యాణ మండపంలో ఆదివారం ఉచితంగా ఆన్‌లైన్ రిజిస్ట్రేషన్ క్యాంప్ నిర్వహిస్తున్నట్లు పెన్నీ మినిస్ట్రీస్ స్వచ్ఛంద సేవా సంస్థ వ్యవస్థాపకుడు దిలీప్‌రాజా తెలిపారు. మీ-సేవ కేంద్రం ద్వారా ఆన్‌లైన్ రిజిస్ట్రేషన్ చేసి ఆరోగ్య బీమా కార్డును అందిస్తామన్నారు. ఆన్లైన్ రిజిస్ట్రేషన్‌కు సంబంధించిన ఖర్చులను తమ సంస్థ భరిస్తుందని చెప్పారు. ఆదివారం ఉదయం 9 గంటల నుండి సాయంత్రం 5 గంటల వరకు జరిగే రిజిస్ట్రేషన్ సౌకర్యాన్ని ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని కోరారు. ఆధార్ కార్డ్‌కు లింక్ అయిన ఫోన్ నంబర్‌కు ఓటీపీ వస్తున్న నేపథ్యంలో ప్రతివ్యక్తి ఆధార్‌తో పాటుగా తమ వెంట ఫోన్ తెచ్చుకోవాలని సూచించారు. కార్యక్రమంలో సంస్థ డైరెక్టర్ డి.ప్రదీప్, మిలటరీ ప్రసాద్, కామన్ సర్వీస్ సెంటర్ ప్రతినిధి డి.శివనారాయణ పాల్గొన్నారు.

స్ఫూర్తిదాయకులు లక్ష్మారెడ్డి

ప్రజాశక్తి-గుంటూరు

మాట్లాడుతున్న చంద్రశేఖర్

ఉపాధ్యాయుల సమస్యలతో పాటు సమాజంలోని రుగ్మతలపై నాలుగు దశాబ్దాలు అలుపెరుగని పోరాటం చేసిన స్ఫూర్తిప్రదాత శీలం లక్ష్మారెడ్డి అని పౌర హక్కుల సంఘం ఏపీ ప్రధాన కార్యదర్శి చిలుక చంద్రశేఖర్ అన్నారు. సంఘం గుంటూరు జిల్లా కమిటీ ఆధ్వర్యంలో శీలం లక్ష్మారెడ్డి సంస్మరణ సభ శనివారం స్థానిక బ్రాడీపేటలోని గుర్రం జాషువా విజ్ఞాన కేంద్రం సమావేశం మందిరంలో నిర్వహించారు. ముఖ్య వక్తగా పాల్గొన్న చంద్రశేఖర్ మాట్లాడుతూ కుటుంబం కంటే ఎక్కువగా ఉపాధ్యాయ వృత్తి, బాధ్యతలు నిర్వహిస్తూ, డెమొక్రటిక్ టీచర్స్ ఫెడరేషన్ వ్యవస్థాపకుడుగా, హక్కుల సంఘం జిల్లా అధ్యక్షులుగా అక్రమ అరెస్టులను తట్టుకొని పౌర హక్కుల కోసం ప్రభుత్వ ధమనకాండపై లక్ష్మారెడ్డి జీవితకాలం పోరాటం చేశారని కొనియాడారు. ప్రజా కళామండలి విప్లవ గీతాలు ఆలపించగా కార్యక్రమానికి జిల్లా ఉపాధ్యక్షులు ఎన్.వి.నరసింహారావు అధ్యక్షత వహించారు. మానవ వికాస కేంద్రం రాష్ట్ర అధ్యక్షులు బి.సాంబశివరావు సిఎల్‌సి రాష్ట్ర ఉపాధ్యక్షులు రాజారావు, జిల్లా కార్యదర్శి సిహెచ్.కోటేశ్వరరావు, ఉప కార్యదర్శులు ఎస్.చిన్న, వి.పేరయ్య, పౌర హక్కుల, ప్రజాసంఘాల నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు

సూపరింటెండెంట్‌కు వినతిపత్రం ఇస్తున్న నాయకులు

అంగన్వాడీ హెల్పర్లకు ప్రమోషన్ ఇవ్వాలి

ప్రజాశక్తి-గుంటూరు

అంగన్వాడీ వర్కర్ పోస్టుకు దరఖాస్తు చేసుకున్న హెల్పర్లకు ప్రమోషన్ ఇవ్వాలని ఏపీ అంగన్వాడీ వర్కర్స్ అండ్ హెల్పర్స్ యూనియన్ (సిఐటియు) నాయకులు కోరారు. ఈ మేరకు పీడీ కార్యాలయంలో శనివారం వినతిపత్రం అందజేశారు. వర్కర్ పోస్టులు ఖాళీ అయిన స్థానాల్లో అర్హులైన హెల్పర్స్ దరఖాస్తు చేసుకున్నప్పుడు వారికి ప్రమోషన్ ఇవ్వాలని, కానీ ఈ ప్రక్రియ నెలల తరబడి ఆలస్యం కావడంతో అంగన్వాడీ కేంద్రాల్లో ఇద్దరు చేయాల్సిన పని ఒక్కరే చేయాల్సి వస్తోందని అన్నారు. దీనివల్ల లబ్ధిదారులు ఇబ్బందులకు గురవుతున్నారని చెప్పారు. హెల్పర్స్ దరఖాస్తులు ఆమోదించాలని కోరారు. జిల్లా కార్యాలయ పర్యవేక్షణ అధికారి మూర్తి మాట్లాడుతూ తమ వద్దకు వచ్చిన దరఖాస్తులన్నీ వారం రోజుల్లో నియామక ప్రక్రియ ప్రారంభిస్తామని హామీ ఇచ్చారు. కార్యక్రమంలో యూనియన్ జిల్లా గౌరవాధ్యక్షులు వై.నేతాజీ, ప్రధాన కార్యదర్శి పి.దీప్తి మనోజ, దరఖాస్తుదారులు పాల్గొన్నారు.

అశ్లీలత నియంత్రణకు పటిష్ట చర్యలు

ప్రజాశక్తి - పల్నాడు జిల్లా

మాట్లాడుతున్న కలెక్టర్

సమాజంలో నైతిక విలువలు పతనం కావడం, ప్రసార, సమాచార, సాంకేతిక మాధ్యమాలు అశ్లీల ప్రసారం కావడం వంటివి మహిళలపై దాడులు, అత్యాచారాలు పెరగడానికి కారణాలని పల్నాడు జిల్లా కలెక్టర్ ఎల్.శివశంకర్ అన్నారు. జిల్లా స్థాయి అశ్లీలత నిరోధక విభాగం ప్రథమ సమావేశం జిల్లా కేంద్రమైన నరసరావుపేటలోని కలెక్టరేట్‌లో వీడియో కాన్ఫరెన్స్ హాల్లో శనివారం నిర్వహించారు. సమావేశానికి అశ్లీల నివారణ విభాగం చైర్మన్‌గా వ్యవహరిస్తున్న కలెక్టర్ అధ్యక్షత వహించి మాట్లాడారు. అశ్లీలతను పారదోలేందుకు తీసుకోవాల్సిన చర్యలపై అధికారులు, ప్రజా సంఘాలు, మహిళా సంఘాల ప్రతినిధులతో సమీక్షించారు. అశ్లీలతను అరికట్టేందుకు ఉన్న చట్టాలు, నిబంధనలను పోలీసు రెవెన్యూ, మున్సిపల్, విద్యాశాఖలు పటిష్టంగా అమలు చేయాలని ఆదేశించారు. సినిమా పోస్టర్లను హోర్డింగ్‌లపై మాత్రమే ప్రదర్శించుకోవాలన్నారు. ముందుగా మున్సిపల్ కార్యాలయంలో చూపి అశ్లీలత లేని వాటిని సిబిఎఫ్‌సి రేటింగ్స్ ద్వారా ఎ, యు/ఎస్ఎ, ఎస్ మొదలగు చిహ్నాలు, ఎపిఎఫ్‌సిసి వారి సీల్ ఉంటేనే ప్రదర్శించాలని స్పష్టం చేశారు. పండుగలు, తిరునాళ్ల సందర్భాల్లో మహిళలను అవమాన పరిచేలా చిత్రీకరించబడిన అశ్లీల పాటలను, నృత్యాలను, ధ్వని కాలుష్యాన్ని నియంత్రించాలన్నారు. గ్రంథాలయాలకు అశ్లీల నవలలు, పత్రికలు రాకుండా చూసుకోవాలని సూచించారు. అశ్లీల ఫొటోలు, కథలు, సీరియల్స్ ప్రచురిస్తున్న ఒ వారపత్రికపై నరసరావుపేట, సత్తెనపల్లిలో ప్రజా, మహిళా సంఘాల కేసులు పెట్టడం అభినందనీయమన్నారు. వీటిపై సత్వర విచారణ జరిపి దోషులకు శిక్ష పడే చూడాలని ఎస్పీని ఆదేశించామని చెప్పారు. పట్టణ సుందరీకరణలో భాగంగా ప్రభుత్వ, ప్రైవేటు గోడలపై ఉన్న అన్ని రకాల గోడ పత్రికలను అక్టోబర్ 2 నుండి నిషేధిస్తున్నామని, గోడ పత్రికల్లేని జిల్లాగా పల్నాడుకు పేరు తేవాలని చెప్పారు. ఇందుకు మున్సిపల్ కమిషనర్లు, తహశీల్దార్లు, సేవా సంస్థలు, పెయింటింగ్ కళాకారులు కృషి చేయాలని కోరారు. కార్యక్రమంలో ట్రైనీ కలెక్టర్ కల్పశ్రీ, డిఆర్‌ఒ వినాయకం, పల్నాడు ఏరియా అర్బన్ డెవలప్మెంట్ అథారిటీ చైర్మన్ శ్రీనివాస్‌రెడ్డి, సెల్ మెంబర్ కన్వీనర్ దీప్తి, అశ్లీలత ప్రతిఘటన వేదిక రాష్ట్ర అధ్యక్షులు ఈదర గోపీచంద్, గురజాల ఆర్డీవో అద్దయ్య, నరసరావుపేట ఫిలిం ఛాంబర్ ప్రతినిధి కె.బాలహనుమంతరెడ్డి, మహిళా సంఘాల నాయకులు డి.శివకుమారి, హెల్డా ఫ్లారెన్స్, కృష్ణకుమారి, డి.ఉదయశ్రీ, ప్రజానాట్య మండలి జిల్లా కార్యదర్శి టి.పెద్దిరాజు, కళాకారులు కె.నాగేశ్వరరావు, పద్యకవి ఇ.వెంకటరెడ్డి పాల్గొన్నారు.

3న ఎంబిటిఎస్‌లో స్పాట్ అడ్మిషన్లు

ప్రజాశక్తి-గుంటూరు

స్థానిక నల్లపాడులోని ఎంబిటిఎస్ ప్రభుత్వ పాలిటెక్నిక్ కళాశాలలో 2023-24 విద్యా సంవత్సరానికి సివిల్, ఎలక్ట్రికల్, మెకానికల్ ఇంజినీరింగ్ విభాగాల్లో డిప్లొమా మొదటి సంవత్సరం ప్రవేశాలకు ఈనెల 3వ తేదీన ఉదయం 9 గంటలకు స్పాట్ అడ్మిషన్లు నిర్వహిస్తున్నట్లు కళాశాల ప్రిన్సిపాల్ టి.శేఖర్ శనివారం ఒక ప్రకటనలో తెలిపారు. పాలీసెట్-2023 ప్రవేశ పరీక్షలో అర్హత సాధించినా, లేకపోయినా ఆసక్తి ఉన్న విద్యార్థులు తమ పదో తరగతి మార్కుల లిస్టు, టిసి, స్టడీ సర్టిఫికెట్, కుల ధ్రువపత్రం, రూ.5800 రుసుం చెల్లించి స్పాట్ అడ్మిషన్ పొందొచ్చని పేర్కొన్నారు.

మాట్లాడుతున్న రమణబాబు

మలినేనిలో ఘనంగా ఫ్రెషర్స్‌డే వేడుకలు

ప్రజాశక్తి-గుంటూరు

మలినేని లక్ష్మయ్య ఇంజినీరింగ్ కాలేజి, పాలిటెక్నిక్ విద్యార్థులకు శనివారం ఫ్రెషర్స్‌డే వేడుకలు ఘనంగా నిర్వహించారు. ముఖ్య అతిథిగా హాజరైన స్టేట్ బోర్డ్ ఆఫ్ టెక్నికల్ ఎడ్యుకేషన్ అండ్ ట్రైనింగ్ ఆంధ్రప్రదేశ్ సెక్రెటరీ కె.వి.రమణబాబు మాట్లాడుతూ విద్యార్థులు విద్యతోపాటు అన్ని రంగాల్లో రాణించాలని, సాంకేతిక అంశాలపై దృష్టిపెట్టి, తమ భవిష్యత్‌కు బంగారు బాటలు వేసుకోవాలని సూచించారు. మలినేని విద్యాసంస్థల అధినేత మలినేని పెరుమాళ్లు మాట్లాడుతూ స్కిల్ డెవలప్‌మెంట్‌లో విద్యార్థులు రాణించాలన్నారు. దానికి అవసరమైన అన్ని సౌకర్యాలనూ కళాశాలలో ఏర్పాటు చేశామని చెప్పారు. కార్యక్రమంలో కళాశాల డైరెక్టర్ డాక్టర్ డి.శ్రీనివాసకుమార్, ప్రిన్సిపాల్ డాక్టర్ పి.రమేష్‌బాబు, కంప్యూటర్ విభాగాధిపతి డాక్టర్ జి.రామస్వామి పాల్గొన్నారు.

బడిఈడు పిల్లలందర్నీ బడిలో చేర్పించాలి : కలెక్టర్

ప్రజాశక్తి-గుంటూరు : విద్యాశాఖలో నూరు శాతం గ్రాస్ ఎన్‌రోల్‌మెంట్ రేషియో నమోదయ్యేలా నిరంతరం పర్యవేక్షిస్తూ అవసరమైన చర్యలు తీసుకోవాలని విద్యాశాఖాధికారులను జిల్లా కలెక్టర్ ఎం.వేణుగోపాల్‌రెడ్డి ఆదేశించారు. శనివారం కలెక్టరేట్ నుండి ఎంఇఒలతో వీడియో కాన్ఫరెన్స్ ద్వారా కలెక్టర్ సమీక్షించారు. స్టూడెంట్ ఇన్ఫో డేటాను సమన్వయం చేసుకుంటూ ఎడ్యుకేషన్ సర్వేను పక్కాగా నిర్వహించేలా సచివాలయ ఉద్యోగులు నిరంతరం పర్యవేక్షించాలన్నారు. పెండింగ్‌లో వున్న స్టూడెంట్ వివరాలను క్షేత్రస్థాయిలో పూర్తిస్థాయిలో వెరిఫై చేయించి రిమార్కులను నమోదు చేయించాలని, మండలాల డేటా వివరాలను ఎప్పటికప్పుడు రాష్ట్ర స్థాయి కంట్రోల్ రూమ్‌కు పంపి ఆన్లైన్ డేటాను జిల్లా స్థాయి అధికారులు సరిచేయించాలన్నారు.

పన్నుల కోసం వచ్చే కాల్స్‌ను నమ్మొద్దు : కమిషనర్

ప్రజాశక్తి - తెనాలి

ఇంటి పన్ను, ట్రేడ్ లైసెన్సుల బకాయిలున్నాయని, ఆన్‌లైన్‌లో చెల్లించాలంటూ వస్తున్న ఫోన్‌కాల్స్‌ను నమ్మవద్దని కమిషనర్ ఎం.జస్వంత్‌రావు కోరారు. సైబర్ నేరగాళ్లు కొందరు ఇలాంటి మోసాలకు పాల్పడుతున్నట్లు తమ దృష్టికి వచ్చిందని, ప్రజలు అప్రమత్తంగా ఉండాలని సూచించారు. అలాంటి కాల్స్ వచ్చినప్పుడు వివరాలను పురపాలక సంఘ కార్యాలయంలోగాని, వార్డు సచివాలయాల్లో గాని నిర్ధారించుకోవాలన్నారు. పన్నుల చెల్లింపుకు సంబంధించి పురపాలక సంఘం కమిషనర్ నుంచి నగదు చెల్లింపుల కాల్స్ కానీ, ఓటీపీ అడగటం గానీ ఉండదని స్పష్టం చేశారు.

ఐదేళ్లుగా రైల్వే అభివృద్ధి మందగమనం

వీక్షణం

ఉమ్మడి గుంటూరు జిల్లాలో ముగ్గురు లోక్‌సభ సభ్యుల పదవీ కాలం ముగింపు దశకు వచ్చింది. షెడ్యూలు ప్రకారం ఎన్నికలు జరిగినా వచ్చే జనవరిలో ఓట్ ఆన్ ఎకౌంట్ బడ్జెట్‌లో ఆశించిన ప్రతిపాదనలు ఆమోదం పొందే అవకాశం లేదు. జిల్లాకు చెందిన ఎంపీలు గల్లా జయదేవ్, లావు శ్రీకృష్ణదేవరాయులు, నందిగం సురేష్ ఐదేళ్లుగా వారు కేంద్ర ప్రభుత్వానికి రైల్వే పరంగా అనేక విజ్ఞాపనలు, ప్రతిపాదనలిచ్చినా చాలా వరకూ ఆమోదం పొందలేదు. ప్రతిపాదనలు కాగితాలకే పరిమితమయ్యాయి. గత ప్రభుత్వ హయాంలో ఆమోదం పొందిన ప్రతిపాదనలకు సంబంధించిన పనులే గత నాలుగేళ్లల్లో వివిధ దశల్లో ఉన్నాయి.

గత 20 ఏళ్లుగా పెండింగ్‌లో ఉన్న గుంటూరు-సికింద్రాబాద్ మార్గంలో నల్లపాడు-పగిడిపల్లి లైను డబ్లింగ్ చేయాలన్న ప్రతిపాదనలపై నర్సరావుపేట ఎంపీ శ్రీకృష్ణదేవరాయులు కృషి మేరకు ఇటీవల రైల్వేబోర్డు ఆమోదించింది. ఈ లైను నిర్మాణం కోసం వచ్చే ఆర్థిక సంవత్సరంలో నిధులు కేటాయించే అవకాశం ఉంది. పల్నాడు ప్రాంతంలో ఇప్పటికీ రైల్వేల అభివృద్ధి ఆశించిన స్థాయిలో జరగలేదు. ఎనిమిదేళ్ల క్రితం గుంటూరు ఎంపీ గల్లా జయదేవ్ ప్రతిపాదించిన అమరావతి రైల్వే లైను అటకెక్కింది. మూడు రాజధానుల ప్రతిపాదనల నేపథ్యంలో ఈ ప్రతిపాదనను రాష్ట్ర ప్రభుత్వమూ పట్టించుకోలేదు. 2016-17లో నిధులు కేటాయించినా ఆ తరువాత ఈ ప్రాజెక్టును పట్టించుకోలేదు.

నడికుడి-శ్రీకాళహస్తి రైల్వే లైను నిర్మాణ పనులు మందగమనంగానే సాగుతున్నాయి. నడికుడి నుంచి శావల్యాపురం మధ్య పనులు పూర్తయ్యాయి. తరువాత పనులు ముందుకు సాగడం లేదు. ప్రకాశం జిల్లా పరిధిలో భూసేకరణ పూర్తికాకపోవడంతో ఈ లైను నిర్మాణంలో తీవ్ర జాప్యమవుతోంది. గుంటూరు-గుంతకల్లు మార్గంలో విద్యుద్దీకరణ పనులు, తెనాలి-గుంటూరు మధ్య డబ్లింగ్ పనులు పూర్తయినా మిగతా ప్రాజెక్టులన్నీ పెండింగ్‌లోనే ఉన్నాయి.

మాచర్ల-గద్వాల్-రాయచూర్ రైలు మార్గం 40 ఏళ్ల క్రితం సర్వే చేశారు. రాయచూర్-గద్వాల్‌మార్గం పనులు పూర్తయ్యాయి. కానీ గద్వాల్ -మాచర్ల మధ్య రైలు మార్గం చేపట్టలేదు. గుంటూరులో కీలకమైన అరండల్‌పేట ఫ్లైవోవర్ బ్రిడ్జిని ఆరు వరుసల మార్గంగా గల్లా జయదేవ్ తొమ్మిదేళ్లుగా కోరుతున్నా ఇంతవరకు మోక్షం లభించలేదు. బాపట్ల నుంచి మచిలీపట్నం రైలు మార్గం ఏర్పాటు చేయాలనే ప్రతిపాదననూ పట్టించుకోలేదు. ఈ మార్గంపై సర్వే పూర్తయిందని, నిజాంపట్నం, రేపల్లె మీదుగా తీర ప్రాంత వాసులకు రైలు సదుపాయాలు కల్పించాలన్న ఎంపీలు బాలశౌరి, నందిగం సురేష్ ప్రతిపాదనలు ఆచరణకు నోచుకోలేదు.

(ఎ.వి.డి.శర్మ)

విద్యార్థులతో చైర్మన్ విద్యాసాగర్

ఎన్ఇపి బ్రాండ్ అంబాసిడర్లుగా వివిఐటి విద్యార్థులు

ప్రజాశక్తి-తెనాలి

నేషనల్ ఎడ్యుకేషన్ పాలసి (ఎన్ఇపి) 2020 బ్రాండ్ అంబాసిడర్లుగా వాసిరెడ్డి వెంకటాద్రి ఇనిస్టిట్యూట్ ఆఫ్ టెక్నాలజి కళాశాల నంబూరు విద్యార్థులు ఎంపికైనట్లు కళాశాల చైర్మన్ వాసిరెడ్డి విద్యాసాగర్ తెలిపారు. ఎన్ఇపి అమల్లో భాగంగా రాష్ట్రం నుంచి 23 మంది విద్యార్థులు ఎంపికైతే వారిలో ముగ్గురు వివిఐటి విద్యార్థులు కావటం కళాశాలకు గర్వకారణంగా చెప్పారు. విద్యార్థుల్లో నాయకత్వ లక్షణాలు, బాధ్యతాయుత ప్రవర్తన, సృజనాత్మకత ప్రామాణికంగా విద్యార్థుల ఎంపిక జరిగినట్లు వెల్లడించారు. వీరు సదస్సులు, చర్చలు, పోటీలు నిర్వహించటం, సోషల్ మీడియా ద్వారా ప్రచారం, హెల్ప్ డెస్క్ ఏర్పాటు వంటి కార్యక్రమాలు నిర్వహిస్తారని తెలిపారు. ఎంపికైన విద్యార్థులు మామిళ్ల మాధురి, రావూల రాజీవ్ చౌదరి, సంగు వెంకటప్రతాప్‌రెడ్డిని కళాశాల్లో శనివారం ఏర్పాటు చేసిన కార్యక్రమంలో ఆయన అభినందించారు. కార్యక్రమంలో ప్రిన్సిపల్ డాక్టర్ వై.మల్లికార్జునరెడ్డి, డీన్లు డాక్టర్ కె.గిరిబాబు, డాక్టర్ ఎన్.కుమారస్వామి పాల్గొన్నారు.